మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 27-9-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 89 Issue: 89

27 సెప్టెంబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:04 తిథి పంచమి మ. 12:03 వరకు తరువాత షష్ఠి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం అనురాధ రా. 1:00ం వరకు తరువాత జ్యేష్ఠ యోగం ప్రీతి రా. 11:44 వరకు కరణం భాలవ మ. 12:03 వరకు కౌలవ రా. 1:16ం వరకు వర్జ్యం ఉ. 7:44 నుండి ఉ. 8:32 వరకు దుర్ముహూర్తం ఉ. 7:44 నుండి ఉ. 8:32 వరకు రాహుకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:37 వరకు యమగండం మ. 1:36 నుండి మ. 3:05 వరకు గుళికాకాలం ఉ. 6:09 నుండి ఉ. 7:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు మ. 1:26 నుండి మ. 3:14 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:43 నుండి మ. 12:30 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Published from Jagitial

www.evarthalu.com



## నేటి బతుకమ్మ: వేపకాయల బతుకమ్మ

బియ్యంపిండిని బాగా వేయించి వేపపండ్లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.

# ఫార్మాపై ట్రంప్ పిడుగు

**100 శాతం టారిఫ్స్ విధిస్తూ ఆదేశాలు**

**అక్టోబర్ 1 నుంచి అమల్లోకి కొత్త సుంకాలు**

**భారతీయ ఫార్మారంగంపై భారీ ప్రభావం**

**టారిఫ్స్ నిర్ణయంతో స్టాక్ మార్కెట్ షేక్**

**కంపెనీలకు ఒక్కరోజులోనే 74 వేల కోట్ల నష్టం**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సుంకాలతో విరుచుకుపడ్డారు. ఫార్మా దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తూ బాంబు పేల్చారు. బ్రాండెడ్, పేటెంట్ ఉన్న ఔషధ ఉత్పత్తుల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. అమెరికాలో ప్లాంట్‌లను నిర్మిస్తున్న విదేశీ ఔషధ తయారీ సంస్థలకు ఈ సుంకాలు వర్తించవని పేర్కొన్నారు. అదేవిధంగా అప్‌హోల్‌స్టర్డ్ ఫర్నిచర్‌పై 30 శాతం, భారీ ట్రక్కులపై 25 శాతం దిగుమతి సుంకాలు విధించనున్నట్లు వెల్లడించారు. అలాగే కిచెన్ క్యాబినెట్, బాత్‌రూమ్ వానిటీలపై తరువాయి 2 వ పేజీలో...



నేటి అవతారం: లలిత త్రిపుర సుందరీ దేవి

శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం, విజయవాడ



# కొత్త డీజీపీగా శివధర్ రెడ్డి

**అక్టోబర్ 1న బాధ్యతల స్వీకరణ.. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి**

**లాయర్ నుంచి సివిల్ సర్వీసెస్ వైపు.. నక్సలైట్ల అణచివేతలో కీలక పాత్ర**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): రాష్ట్ర నూతన డీజీపీగా శివధర్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ పోలీసు యంత్రాంగానికి శివధర్ రెడ్డి నాయకత్వం వహించనున్నారు. 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన శివధర్ రెడ్డి, ప్రస్తుతం రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్గా అత్యంత కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా ఆయన సమర్థవంతమైన సేవలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు అత్యున్నతమైన ఈ పదవిని అప్పగించింది. ప్రస్తుత డీజీపీ జితేందర్ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో, తరువాయి 2 వ పేజీలో...

# బీసీలకు 42% జీవో

**'స్థానికం'లో రిజర్వేషన్లు ఖరారు.. సర్కారు అధికారిక ఉత్తర్వులు జారీ**

**నేడు డీజీపీ, అధికారులతో ఈసీ భేటీ.. మధ్యాహ్నానికి నోటిఫికేషన్ వచ్చే చాన్స్!?**



తెలంగాణలో పల్లె, పట్టణ స్థానిక సంస్థల్లో బీసీలకు భారీగా రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీ సంక్షేమ శాఖ జీవో నం.9ను శుక్రవారం విడుదల చేసింది. ఈ రిజర్వేషన్ల ఆధారంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. బీసీ రిజర్వేషన్ల విషయంలో బుసాని వెంకటేశ్వరరావు కమిటీ సిఫారసులను ప్రభుత్వం ఆమోదించింది. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వే ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు నిర్ణయించారు. ఆర్టికల్స్ 40, 243డీ, 243టీతో పాటు డైరెక్టివ్ ప్రిన్సిపిల్స్ ప్రకారం ఈ రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): అసెంబ్లీలో ఈ బిల్లకు ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రకారం అమలులోకి రాబోయే ఈ రిజర్వేషన్లతో తెలంగాణ దేశంలోనే తొలిసారి బీసీలకు పల్లె, పట్టణ స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించిన రాష్ట్రంగా నిలిచింది. ఈ నిర్ణయంతో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం గణనీయంగా పెరగనుంది. రాబోయే ఎన్నికల్లో స్థానిక సంస్థల్లో బీసీ వర్గాల ప్రాధాన్యం మరింత బలపడనుంది. మరోవైపు, శనివారం ఉదయం ముఖ్య కార్యదర్శి, డీజీపీ, ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల సంఘం సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్, భద్రతా ఏర్పాట్లపై చర్చించనున్నారు.

### పంచాయతీరాజ్ శాఖ 41, 42 జీవోలు

రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీల రిజర్వేషన్ల విధానంపై పంచాయతీ రాజ్ శాఖ జీవో జారీ చేసింది. ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు. బీసీలకు కులగణన డేటా ఆధారంగా రిజర్వేషన్లు కల్పించారు. ఇప్పటికే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. శనివారం రాజకీయ పార్టీల సమక్షంలో డ్రా ద్వారా మహిళా రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. మండల, జిల్లా పరిషత్తులకు ముందుగా ఎన్నికలు నిర్వహించే అవకాశ ముంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల తర్వాత పంచాయతీ ఎన్నికలు జరిపే అవకాశమున్నట్టు సమాచారం. పంచాయతీలు, వార్డుల్లో రిజర్వేషన్ల విధివిధానాలపై కూడా జీవో జారీ అయింది.



# రేవంత్ అహంకారం వల్లే ఎల్అండ్‌టీ దూరం

**ఇది తెలంగాణ సర్కారుకు మాయని మచ్చ**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): సీఎం రేవంత్ రెడ్డి అహంకారం వల్ల, ఏకపక్ష నియంతృత్వ పోకడలతో ఎల్ అండ్ టీ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆ సంస్థకు హైద్రాబాద్ మెట్రో విషయంలో 2070 దాకా లీజు ఉంది అంటే 45 ఏండ్లు ఇంకా సమయం ఉంది. ఇవాళ ఎల్ అండ్ టీ ఎందుకు వెళ్లిపోయిందో సీఎం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పెట్టుబడులకు స్వర్గధామంగా ఉన్న హైదరాబాద్ నుంచి ఆ సంస్థ వెళ్లిపోయిందంటే అది తెలంగాణ రాష్ట్రానికి మాయని మచ్చ అని కేటీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయాన్ని చాలా బాధ్యతరాహిత్యంగా, ఆలోచనరహితంగా తీసుకుంటే.. అదేదో గొప్ప పని తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.11,488 |
| వెండి (గ్రాము): | రూ.153 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,389 |

# కారు అభ్యర్థి ఖరారు

**జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాగంటి సునీత**

**అధికారికంగా ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): హైదరాబాద్: జూబ్లీహిల్స్ బైఎలక్షన్‌కు సంబంధించి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాగంటి గోపినాథ్ భార్య మాగంటి సునీత పేరు ఖరారైంది. మాగంటి సునీత పేరును పార్టీ అధినేత కేసీఆర్ అధికారికంగా ప్రకటించారు. జూబ్లీహిల్స్ ప్రజల ఆకాంక్షల మేరకే సునీతకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. చిత్తశుద్ధి కలిగిన నిస్వార్థనేతగా, మాగంటి గోపీనాథ్ నిబద్ధతను పరిశీలించామని కేసీఆర్ పేర్కొన్నారు. అన్నింటిని గమనించి గోపీనాథ్ పార్టీకి, ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపు గౌరవాన్నిస్తున్నాన్నారు. ఈ సందర్భంగా సునీత స్పందించారు. తనపై విశ్వాసం ఉంచి పార్టీ అవకాశం కల్పించినందుకు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల మద్దతు, ఆశీర్వాదం తనకు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

## స్పీకర్‌తో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ

# మత్తయ్యకు ఊరట

**ఓటుకు నోటు కేసులో ఆయన పేరు క్వాష్ సరైనదే**

**అందుకు కారణాలున్నాయ్.. సుప్రీం కోర్టు తాజా తీర్పు**



న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో ప్రకంపనలు సృష్టించిన ఓటుకు నోటు కేసు మరో మలుపు తిరిగింది. ఇందులో మత్తయ్య పాత్రపై విచారణ చేసేందుకు ప్రభుత్వం వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టేసింది. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. జస్టిస్ బీఆర్ గవాయ్ ధర్మాసనం ఇప్పటికే ఈ కేసులో విచారణ చేసి తీర్పును రిజర్వ్ చేసింది. ఆ తీర్పును శుక్రవారం వెల్లడించింది. ఓటుకు నోటు జెరూసలేం మత్తయ్య కేసులో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. మత్తయ్య పేరును కేసులో క్వాష్ చేయడానికి తగిన కారణాలు ఉన్నాయి తేల్చి చెప్పింది. ఓటుకు నోటు కేసు నుంచి జెరుసలెం మత్తయ్య పేరును హైకోర్ట్ క్వాష్ చేయడాన్ని సవాల్ చేస్తూ 2016లో తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టును తరువాయి 2 వ పేజీలో...




# ప్రభుత్వం కంటే ప్రజలే ముఖ్యం

**ఆర్ఆర్ఆర్ బాధితులకు అండగా ఉంటా**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

## విశ్వవాణి



బాగా కష్టపడితేనే మంచి భవిష్యత్తు ఉంటుందన్న మాటను నేటి సమాజం నమ్మడం లేదని తాజా అధ్యయనంలో తేలింది. అసమానత్వం, ఆటోమేషన్ లాంటివి మనల్ని తొక్కేస్తాయని భావిస్తున్నారట. 28 దేశాల్లో 34 వేల మందిపై చేసిన సర్వేలో ఈ అంశాలు వెలుగులోకి వచ్చాయి.



# మరణమే శరణ్యం

**నవమి లోపు నా విషయం తేల్చండి**

**లేకుంటే నాకు జీవసమాధే గతి**

**సీఎం రేవంత్ పట్టించుకోవడం లేదు**

**మాజీ డీఎస్పీ నళిని సంచలన వ్యాఖ్యలు**



# వరుణుడి దండయాత్ర

**ఎడతెరిపి లేకుండా వర్షాలు.. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్**

**24 గంటల్లో అతి భారీ వర్షాలు.. ముందస్తు చర్యలు చేపట్టండి.. సీఎం రేవంత్ ఆదేశాలు**





# బీర్ల ఐలయ్య రాజకీయ వ్యభిచారం

**కాంగ్రెస్‌ను బొందపెట్టే పన్నాగాలు**

**మదర్ డెయిరీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతు**

**ఎమ్మెల్యే సామేల్ సంచలన వ్యాఖ్యలు.. కాంగ్రెస్‌లో అలజడి**

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బీర్ల ఐలయ్య లఫంగి రాజకీయాలు మానుకుని, కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి రాజకీయ వ్యభిచారం తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు
27.9.2025

మేషం: స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాల్లో ఊహించని అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది. నిరుద్యోగులు శ్రమ వృధాగా మిగులుతుంది. ఆర్థికంగా ఆశించిన ఫలితాలు ఉండవు.

వృషభం: చిన్ననాటి మిత్రులు ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్థిరస్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు.

మిధునం: ఉద్యోగాలలో మీ పనితీరుతో అందరిని ఆకట్టుకుంటారు. స్నేహితుల సహాయంతో రుణ సమస్యలు నుండి బయటపడతారు. సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి.

కర్కాటకం: వృత్తి వ్యాపారాలు మరింత నిరుత్సాహ పరుస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. ఉద్యోగ వాతావరణం అంతగా అనుకూలించదు. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి.

సింహం: నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. సన్నిహితులతో మాటపట్టింపు తప్పవు. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆందోళన కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరగటం వలన తగినంత విశ్రాంతి లభించదు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య: అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. సమాజంలో గౌరవ మర్యాదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారానికి నూతన పెట్టుబడులకు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. చాలకాలంగా వేదిస్తున్న సమస్యలు నుండి బయటపడతారు.

తుల: నేత్ర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. గృహమున కొందరి ప్రవర్తన మానసిక అశాంతి కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు అందుకోవడానికి మరింత కష్టపడాలి. ఉద్యోగ విషయాల్లో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

వృశ్చికం: ఆదాయ మార్గలు సంతృప్తి కలిగిస్తాయి. ఇంట బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన కార్యక్రమాలు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు ఉన్నపటికీ సమర్థవంతంగా నిర్వహిస్తారు.

ధనస్సు: సోదరులతో స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. వృత్తి వ్యాపారాలు మరింత నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించడం మంచిది.

మకరం: ముఖ్యమైన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు పుంజుకుని మరింత ముందుకు సాగుతాయి. ధన వ్యవహారాలు ఆశజానాకంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహంతో అనుకూల మార్పులు చోటుచేసుకుంటాయి.

కుంభం: నిరుద్యోగుల కలలు సాకరమౌతాయి. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్యాలు ఆహ్వానాలు అందుతాయి. భూ క్రయ విక్రయాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారాలలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

మీనం: ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది. బంధు మిత్రులుతో అకారణ వివాదాలు కలుగుతాయి. నూతన వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టె విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది. ఉద్యోగస్తులకు సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులుపెరుగుతాయి.

# ఫార్మాపై ట్రంప్ పిడుగు

మొదటి పేజీ తరువాయి

50 శాతం టారీఫ్‌లు విధిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం అక్టోబర్ 1 నుంచి అమల్లోకి తీసుకొస్తామన్నారు. జాతీయ భద్రతతో పాటు ఇతర కారణాలను పరిగణనలోకి తీసుకుని ఈ టారిఫ్‌లు విధిస్తున్నట్లు తన సోషల్ మీడియా మాధ్యమం ట్రూత్ ద్వారా ట్రంప్ తెలిపారు. అమెరికా అధ్యక్షుడు తీసుకున్న ఈ నిర్ణయంతో భారతీయ ఫార్మా పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. భారత ఫార్మా కంపెనీలకు అమెరికా అతిపెద్ద మార్కెట్‌గా ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత్ మొత్తంగా 27.9 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసింది. ఇందులో 8.7 బిలియన్ డాలర్ల విలువైన ఔషధాలు అమెరికాకే ఎగుమతి అయ్యాయి. అంటే మొత్తం ఎగుతుల్లో ఇది 31 శాతం. ఇక అగ్రరాజ్యంలో ఉపయోగించే జనరిక్ ఔషధాల్లో 45 శాతం, బయోసిమిలర్ ఔషధాల్లో 15 శాతం మన దేశం నుంచి సరఫరా చేసినవే కావడం గమనార్హం. ట్రంప్ సుంకాల కారణంగా శుక్రవారం స్టాక్ మార్కెట్లు ప్రారంభమైన వెంటనే ఫార్మా ఇండెక్స్ 2 శాతం కంటే ఎక్కువ పడిపోయింది. దేశంలోని 119 ఫార్మాస్యూటికల్ కంపెనీలలో 112 షేర్లు క్షీణిస్తున్నాయి. ఉదయం సెషన్‌లో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంది, ఫలితంగా ట్రేడింగ్ సెషన్‌లో ఫార్మా రంగం వాల్యుయేషన్ రూ.74,000 కోట్లకు పైగా తగ్గింది. దివిస్ ల్యాబ్స్ నుండి సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ వరకు ఉన్న షేర్లు స్టాక్ మార్కెట్లో గణనీయమైన క్షీణతను చూస్తున్నాయి. గతంలో ట్రంప్ ట్రూత్ సోషల్‌లో అక్టోబర్ 1, 2025 నుండి ఏదైనా బ్రాండెడ్ లేదా పేటెంట్ పొందిన ఫార్మా ఉత్పత్తులపై 100 శాతం సుంకాన్ని విధిస్తామని ప్రకటించారు. యునైటెడ్ స్టేట్స్‌లో ప్లాంట్‌ను కలిగి ఉన్న లేదా ప్రస్తుతం స్థాపించే ఏ ఔషధ కంపెనీ కూడా ఈ సుంకాలు వర్తించవు. ఈ సుంకాలను ఎలా అమలు చేస్తారనే దానిపై ఆయన లేదా వైట్ హౌస్ ఇంకా ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ నిర్ణయం తర్వాత స్టాక్ మార్కెట్లో ఫార్మా స్టాక్‌లు క్రాష్ అయ్యాయి. గురువారం 29,51,033.05 కోట్లుగా ఉన్న బిఎస్ఇ హెల్త్‌కేర్ ఇండెక్స్ మొత్తం మార్కెట్ క్యాప్ శుక్రవారం ట్రేడింగ్ సెషన్‌లో 28,76,843.27 కోట్లకు పడిపోయింది. అంటే దేశ ఫార్మాస్యూటికల్ రంగం 74,189.78 కోట్ల నష్టాన్ని చవిచూసింది. బిఎస్ఇ హెల్త్‌కేర్‌లో 119 ఫార్మాస్యూటికల్ కంపెనీలు జాబితా చేయబడ్డాయి. 112 కంపెనీల షేర్లు క్షీణించగా, 7 కంపెనీల షేర్లు గ్రీన్‌లో ట్రేడవుతున్నాయి. ఫార్మా ఎగుమతుల పరంగా అమెరికా భారతదేశానికి ప్రధాన మార్కెట్. భారతదేశం అమెరికాకు చేసే మొత్తం ఎగుమతులకు ఔషధాలు గణనీయంగా దోహదం చేస్తాయి. ఔషధ ఎగుమతుల్లో కూడా భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. 2025 ఆర్థిక సంవత్సరంలో భారతదేశ వార్షిక ఔషధ ఎగుమతులు రికార్డు స్థాయిలో 30 బిలియన్ డాలర్లలకు చేరుకున్నాయి. ముఖ్యంగా మార్చిలో ఎగుమతులు 31 శాతం వృద్ధిని సాధించాయి. ప్రభుత్వ డేటా ప్రకారం.. ఇతర దేశాలకు ఔషధ ఎగుమతులు 6.94 శాతం పెరిగి 2024 ఆగస్టులో 2.35 బిలియన్ డాలర్ల నుండి 2025 ఆగస్టులో 2.51 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అమెరికాకు భారత్ ప్రధాన ఎగుమతి వనరు అయిన జెనరిక్ ఔషధాలను డోనాల్డ్ ట్రంప్ ఫార్మా సుంకాల నుండి తప్పించినప్పటికీ, డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మా, జైడస్ లైఫ్‌సైన్సెస్, సన్ ఫార్మా, సిప్లా, గ్లెన్‌మార్క్ ఫార్మా వంటి ప్రధాన కంపెనీలపై ప్రభావం పడనుంది ఈ కంపెనీల మొత్తం ఆదాయంలో 30-50 శాతం అమెరికా మార్కెట్ నుండి పొందుతున్నాయి. దీని ఫలితంగా శుక్రవారం ప్రధాన భారతీయ స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ రెండింటిలోనూ తీవ్ర క్షీణత ఏర్పడింది.



## ప్రభుత్వం కంటే ప్రజలే ముఖ్యం

**ఆర్ఆర్ఆర్ బాధితులకు అండగా ఉంటా**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

మునుగోడు, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం రోడ్డు కింద మునుగోడు నియోజకవర్గంలో భూములు భూనిర్వాసితులు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని కలిశారు. దక్షిణ భాగంలో అలైన్మెంట్ ను మార్చారని, దివిస్ కంపెనీకి లాభం చేకూరేలా చేస్తున్నారని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. భూమిపోతే తమకు జీవితమే పోతుందని,తమకు న్యాయం చేయాలని కోరుతూనే, భూమికి భూమి ఇవ్వడమే మా నినాదం అని భూనిర్వాసితులు ఆయనను కోరారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ.. భూమికి రైతుకు మధ్య భావోద్వేగ బంధం ఉంటుందన్నారు. ఇది చాలా సున్నితమైన సమస్య అని చెప్పారు. పార్టీ కంటే, ప్రభుత్వం కంటే ప్రజలే ముఖ్యం అనే బావనతో ఆలోచన చేస్తున్నానని తెలిపారు. భూ నిర్వాసితులకు న్యాయం చేయడానికి ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం రహదారి వెళ్తున్న నియోజకవర్గాల శాసనసభ్యులతో కూడా తాను మాట్లాడుతున్నానని వెల్లడించారు. ఈ విషయంలో అందరు ఎమ్మెల్యే లు ఆవేదనతోనే ఉన్నారని రాజగోపాల్ అన్నారు. అధికార పార్టీలో ఉన్నప్పటికీ తాను ప్రజల పక్షాన మాట్లాడతానని, పదవి అంటే కిరీటం కాదు బాధ్యత అని రాజగోపాల్ రెడ్డి చెప్పారు. ధర్మం, న్యాయం వైపు తాను ఉంటానని తెలిపారు. సగం మునుగోడు నియోజకవర్గం ఆర్ఆర్ఆర్‌లోనే కలుస్తుందన్నారు. అలైన్ మెంటు మార్చడానికి కారణాలను రైతులకు వివరించి ఒప్పించి నిర్ణయం తీసుకోవాలని వెల్లడించారు. మీకు న్యాయం చేసేవారి వైపు, మీకోసం కొట్లాడే వారి వైపు ఉండాలని పిలుపునిచ్చారు. ఉత్తర భాగంలోనే అలైన్ మెంట్ విషయంలో తప్పు జరిగిందని, ఇపుడు దక్షిణ భాగంలో కూడా ఆ తప్పును కొనసాగిస్తున్నారని అన్నారు. ట్రిపుల్ ఆర్ వెళ్లే నియోజకవర్గ ఎమ్మెల్యేలం అందరం కలిసి ముఖ్యమంత్రితో మాట్లాడుతామని రాజగోపాల్ వెల్లడించారు. ఇక 2017 లో శివన్నగూడెం ప్రాజెక్టును ప్రారంభించారు కానీ పరిహారం మాత్రం 2023లో తాను రాజీనామా చేసిన తరువాత పూర్తి చేశారని అన్నారు.

# మత్తయ్యకు ఊరట

మొదటి పేజీ తరువాయి

ఆశ్రయించింది. ఈ కేసులో ఏ4గా ఉన్న మత్తయ్యను విచారిస్తే మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై అప్పటి నుంచి విచారణ సాగింది. సుదీర్ఘంగా సాగిన విచారణ ఈ నెల 22తో ముగిసింది. ఇరువైపులా వాదనల విన్న తర్వాత సుప్రీం కోర్ట్ ధర్మాసనం తీర్పు రిజర్వ్ చేసింది. ఆ తీర్పును శుక్రవారం చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా జస్టిస్ బి ఆర్ గవాయ్ వెల్లడించారు. ఓటుకు నోటు కేసు 2016లో వెలుగు చూసింది. ఇందులో ప్రేరేపితుడిగా మత్తయ్య %ూ%4గా చేర్చారు. ఈ కేసుతో తనకు సంబంధం లేదని హైకోర్టులో వాదించి ఆయనపై ఉన్న కేసును క్వాష్ చేయించుకున్నారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లింది. దీనిపై విచారణ పూర్తై తీర్పు వచ్చే తరుణంలో ఈ మధ్య కాలంలో మత్తయ్య సుప్రీంకోర్టుకు లేఖ రాశారు. ఇందులో సూత్రధారులు పాత్రధారులు ప్రస్తుతం ముఖ్యమంత్రులుగా ఉన్న రేవంత్ రెడ్డి, చంద్రబాబుదేనంటూ బాంబు పేల్చారు. సుప్రీం చీఫ్ జస్టిస్‌కు రాసిన లేఖ అంటూ మత్తయ్య ఓ ఓపెన్ లెటర్ రాశారు. ఇందులో సంచలన ఆరోపణలు చేశారు. చంద్రబాబు, రేవంత్ రెడ్డి తనను పిలిచి ఓటు నోటు కేసు గురించి మాట్లాడారని ఓ ఎమ్మెల్సీని ఒప్పించాలని కూడా సూచించినట్టు చెప్పుకొచ్చారు. ఐదు కోట్లు తీసుకొని తమకు అనుకూలంగా ఓటు వేసేలా నచ్చజెప్పాలని కూడా ప్రోత్సహించినట్టు లేఖలో వెల్లడించారు. ఈకేసులో అప్రూవర్‌గా మారేందుకు సిద్ధంగా ఉన్నట్టు లేఖలో పేర్కొన్నారు. రెండు ప్రభుత్వాలను రద్దు చేసి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆ లేఖలో అభిప్రాయపడ్డారు.

## బీర్ల ఐలయ్య రాజకీయ వ్యభిచారం

మొదటి పేజీ తరువాయి



చేసుకోవాలన్నారు. గురువారం భువనగిరిలో మీడియాతో మందుల సామేల్ మాట్లాడారు. మదర్ డెయిరీ ఎన్నికల్లో తమ జిల్లా నాయకులు కొంతమంది బీఆర్ఎస్ పార్టీతో పొత్తు పెట్టుకుంటున్నట్లు ఆరోపించారు. డీసీసీ అధ్యక్షుడు, మదర్ డెయిరీ చైర్మన్ మీకు బంధుత్వం కోసం కాంగ్రెస్ పార్టీని బొందపెట్టవద్దన్నారు. మదర్ డెయిరీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే నైతికంగా బాధ్యత వహిస్తూ బీర్ల ఐలయ్య తన పదవులకు రాజీనామా చేయాలన్నారు. ప్రభుత్వ విప్‌గా ఉన్న బీర్ల ఐలయ్య కాంగ్రెస్ పార్టీని బొందపెట్టె ప్రయత్నం చేస్తున్నట్లు మండిపడ్డారు. రేపు జరగబోయే మదర్ డెయిరీ ముగ్గురు డైరెక్టర్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని చైర్మన్లను వేడుకుంటున్నట్లు చెప్పారు. ఎవరి ప్రలోభాలకు గురి కాకుండా ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు, మదర్ డెయిరీ చైర్మన్ జంగిలి పనులు, లఫంగ పనులు చేయకండని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ ఓడితే నాయకులు, కార్యకర్తలు వారికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

# వరుణుడి దండయాత్ర

## ఎడతెరిపి లేకుండా వర్షాలు.. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్.. 24 గంటల్లో అతి భారీ వర్షాలు

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంపై వరుణుడు దండయాత్ర చేస్తున్నాడా? అన్నట్లు కురుస్తున్నాయి వర్షాలు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు ఉప్పొంగుతున్నాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోడకూలి ఓ మహిళ మృతి చెందింది. సంగారెడ్డి జిల్లాలో 65వ జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున నీళు నిలవడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. జిల్లాల్లోనూ దంచికొట్టిన వానలతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలం బెంగుళూరులో విషాదం చోటు చేసుకుంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి గోడ కూలి మంద లక్ష్మి అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె భర్త దుర్గయ్యకు గాయాలు అవ్వడంతో మహదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతురాలు పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమై ఉంది. సంగారెడ్డి జిల్లా హెడ్‌క్వాటర్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులోకి భారీగా నీరు చేరి కూరగాయల దుకాణాలు నీట మునిగాయి. సంచులలో నిల్వచేసిన కూరగాయలు సైతం తడిచిపోవడంతో వేలాది రూపాయలు నష్టపోతున్నామని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదేళ్లుగా చినుకు పడితే చాలు ఇదే పరిస్థితి తలెత్తుతోందని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షానికి చెరువులు మత్తళ్లు దూకాయి. గుండు వాగు ఉద్ధృతితో టేక్మాల్, జోగిపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా వర్షం కాసేపు ఆగుతూ, మరోసారి దంచికొడుతోంది. హనుమకొండ జిల్లా పరకాల రెవెన్యూ డివిజన్ వ్యాప్తంగా చెరువులు, కుంటల్లోకి భారీగా వరద చేరుతుంది. ఆత్మకూరు మండలం కటాక్షపూర్ చెరువు నిండుకుండల మారి అలుగు పోస్తుండటంతో జాతీయ రహదారిపై వాహన రాకపోకలు నెమ్మదిగా కొనసాగుతున్నాయి. వరద ధాటికి చలివాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. నడికుడ మండలం కంటాత్మకూర్ వాగులోకి భారీగా ప్రవాహం వస్తుండటంతో పరకాల నుంచి అంబాల హనుమకొండ వైపుగా వెళ్లాల్సిన వాహనాలను పోలీసులు దారి మళ్లించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం బొక్కలగుట్ట గ్రామ శివారులో గండిపడిన గాంధారి ఖిల్లా మేడి చెరువును కలెక్టర్ కుమార్ దీపక్ పరిశీలించారు. పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం ఆర్జీ-3 పరిధిలోని ఓసీపీ-2 కార్యాలయాల్లోని వరద చేరింది. వేల్ఫేర్ సెక్షన్, సర్వేస్ సెక్షన్, మేనేజర్ రూమ్, వర్క్‌షాపులు, క్యాంటీన్, కార్లు నీట మునిగాయి. బొగ్గు ఉత్పత్తి, ఓబీ మట్టి వెలికితీసే పనులు సైతం నిలిచిపోయాయి. జయశంకర్ జిల్లా భూపాలపల్లి సింగరేణి డివిజన్‌లోని కాకతీయ-2, 3 ఉపరితల గనుల్లో బొగ్గును తరలించే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. భారీ వర్షంతో ఉపరితల గనుల క్వారీలన్నీ బురదమయం అయ్యాయి. లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపుతోపాటు రోజుకు 8 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడిందని సింగరేణి అధికారులు చెబుతున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరదతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం అంతకంతకూ పెరుగుతోంది. మధ్యాహ్నం 12 గంటలకు 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో స్నానఘట్టాల వద్ద మెట్లు, విద్యుత్ స్తంభాలు నీటిలో మునిగాయి. నదిలో స్నానాలు ఆచరించే భక్తులు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

### రాబోయే 24 గంటల్లో అతి భారీ వర్షాలు

వాయవ్య మధ్య బంగాళాఖాతం సమీపంలో వాయుగుండం ఏర్పడింది. పూరీ తీరానికి దక్షిణ ఆగ్నేయంగా 60 కిలోమీటర్ల దూరంలో, గోపాల్‌పూర్‌కు తూర్పు దిశగా వాయుగుండం కేంద్రీకృతమైంది. క్రమంగా వాయువ్య దిశగా వాయుగుండం ప్రయాణం చేస్తుంది. పూరీ, కళింగపట్న సమీపంలో వాయుగుండం తీరం దాటనుంది. మహారాష్ట్ర నుంచి తెలంగాణ, కర్ణాటక మీదుగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. వాయుగుండం ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది. తెలంగాణలో రాగల 24 గంటల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో అన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా 21 సెం.మీ.కు పైగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. ఇక ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాతో పాటు అన్ని జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. దాదాపు 12 నుంచి 20 సెం.మీ. వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది.

### అధికారులతో సీఎం సమీక్ష

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో వర్షాలపై సీఎస్ రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. లోతట్టు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. అన్ని విభాగాల అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. హైదరాబాద్ సిటీలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ, హైడ్రాతో పాటు, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అన్ని విభాగాలను అప్రమత్తం చేయాలని సీఎస్‌ను ఆదేశించారు.

## కొత్త డీజీపీగా శివధర్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

అక్టోబర్ 1వ తేదీ నుంచి శివధర్ రెడ్డి తెలంగాణ డీజీపీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. బత్తుల శివధర్ రెడ్డి, 1994 బ్యాచ్‌కు చెందిన ఈ సీనియర్ ఐపీఎస్ అధికారి తెలంగాణ పోలీసు శాఖలో ధైర్యం, నిబద్ధతకు మారుపేరు. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసి, న్యాయవాదిగా పనిచేసిన ఆయన, సివిల్ సర్వీసెస్‌లోకి ప్రవేశించారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్‌లో అనకాపల్లి ఏఎస్పీ నుంచి నల్గొండ ఎస్పీ వరకు, గ్రేహౌండ్స్, ఎస్ఐబీ వంటి కీలక విభాగాల్లో పనిచేశారు. ముఖ్యంగా, నక్సలైట్ల హింసను (ఎల్‌డబ్ల్యూఈ) సమర్థవంతంగా అణిచివేయడంలో, 2007లో మక్కా మసీదు బాంబు పేలుళ్ల అనంతర సంక్షోభాన్ని నియంత్రించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. తెలంగాణ తొలి ఇంటెలిజెన్స్ చీఫ్‌గా (2014), మళ్లీ 2023లో తిరిగి బాధ్యతలు చేపట్టిన శివధర్‌రెడ్డి, పోలీస్ శౌర్య పతకం సహా పలు విశిష్ట అవార్డులను అందుకున్నారు. ఇప్పుడు ఆయన తెలంగాణ కొత్త డీజీపీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

## స్పీకర్‌తో ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు శుక్రవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు కూడా పాల్గొన్నారు. స్పీకర్ నోటీసులకు ఇప్పటికే కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ప్రకాష్ గౌడ్‌లు వివరణ ఇచ్చారు. అయితే, ఈ నెల 30వ తేదీ వరకూ కడియం శ్రీహరి గడువు కోరారు. ఈనెల 29 నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యక్ష విచారణ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అక్టోబర్ 6వ తేదీ నుంచి 23వ తేదీ వరకు స్పీకర్ విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు.

## మరణమే శరణ్యం

**నవమి లోపు నా విషయం తేల్చండి**

**మాజీ డీఎస్పీ నళిని సంచలన వ్యాఖ్యలు**

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): వచ్చే నవమి లోపు తన విషయం తేల్చకపోతే మరణమే శరణ్యమని, జీవసమాధి అవుతానని మాజీ డీఎస్పీ నళిని అన్నారు. తెలంగాణ ఉద్యమం సమయంలో ఆమె తన పదవికి రాజీనామా చేసిన విషయం విదితమే. మరణ వాంగ్మూలం పేరుతో ఆమె తన సామాజిక మాధ్యమాల్లో గత వారం రోజులగా పలు పోస్టులు పెడుతూ వస్తున్నారు. తాజాగా శుక్రవారం మరో పోస్టును విడుదల చేశారు. తన సమస్యను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని ఆమె ఆరోపించారు. తన మరణ వాంగ్మూలాన్ని ఆర్డీవోతో నమోదు చేయించడం మినహా ఇప్పటివంకు చేసిందేమీ లేదని విమర్శించారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో మృతి చెందిన రేవతి కుటుంబాన్ని ఆదుకోవడానికి వారికి వారం రోజులు కూడా పట్టలేదని, కానీ తన విషయంలో సంవత్సరాల తరబడి కావాలనే జాప్యం చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఏ అధికారిని అయినా సస్పెండ్ చేస్తే ఆరు నెలల్లోపు విచారణ పూర్తి చేయాలని ఆమె తెలిపారు. విచారణ సమయంలో 1/3 లేదా 1/2 జీతాన్ని జీవన భృతి కింద ఇవ్వవలసి ఉంటుందని అన్నారు.

## విద్య, ఉద్యోగవాణి

**నవోదయ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు**

జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి అప్లికేషన్ గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు అధికారులు తెలిపారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 23తో గడువు ముగియగా, తాజాగా పొడిగించారు. విద్యార్థుల ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి, మే 1, 2011 నుంచి జులై 31, 2013 మధ్య జన్మించి ఉండాలి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష ఉంటుంది.

# రేవంత్ రెడ్డి ఓ యూటర్న్ సీఎం: హరీశ్‌రావు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): రేవంత్ రెడ్డి ఓ యూటర్న్ ముఖ్యమంత్రి అంటూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రస్థాయిలో నిప్పులు చెరిగారు. ఆదాయం పెంచుకునేందుకు రేవంత్ సర్కార్ అడ్డదారులు వెతుక్కుంటుందని మండిపడ్డారు. రేవంత్ పాలన ప్రజలపై పన్నుల భారం మోపుతున్నది అని ధ్వజమెత్తారు. 6 గ్యారంటీలు 420 హామీల ఊసు లేదు కానీ మద్యం ఆదాయం రెట్టింపు చేసుకునే దిశగా కొత్త పాలసీ తెచ్చారు. కేసీఆర్ తెచ్చిన పథకాలకు కోతలు, ప్రజలకు పన్నుల వాతలు తప్ప 22 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదు. ఇప్పటికే మద్యం ధరలను ఇష్టారీతిగా పెంచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆదాయాన్ని మరింత పెంచుకునే విధంగా కొత్త పాలసీ తెచ్చింది. ఇప్పుడు మద్యం షాపుల దరఖాస్తు ఫీజును ఏకంగా రెండు లక్షల నుంచి మూడు లక్షల రూపాయలకు పెంచారు అని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలప్పుడు మాయ మాటలు చెప్పి.. పాలనలోకి రాగానే మోసపు చేతలు చేస్తున్నారంటూ హరీశ్‌రావు మండిపడ్డారు. ప్రజలపై ఆర్టీసీ బస్సు చార్జీల మోతలు వేశారు. వాహనాలపై పన్నుల భారం మోపారు, ఆర్ఆర్ టాక్స్‌లు వేశారు. ప్రజలకు సంక్షేమం పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చి గద్దె నెక్కగానే గరీబోళ్ల సంపాదనను కొల్లగొట్టే పథకాలు రచిస్తున్నారు. బెల్ట్ షాపులు ఎత్తివేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ దాన్ని తుంగలో తొక్కి గ్రామ గ్రామాన మద్యం ఏరులై పారేలా చేసింది. ప్రజలకు మద్యం తాగించడం ఖజానా నింపుకోవడం అనే విధానం రేవంత్ రెడ్డి పాటిస్తున్నాడు, అందుకోసం అన్ని రకాల మద్యంపై ధరలు పెంచాడు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. మద్యం అమ్మకాలు పెరగాలని అధికారులపై ఒత్తిడి తెస్తూ వేధిస్తున్నాడు. మద్యం అమ్మకాలు టార్గెట్ రీచ్ కాలేదని అధికారులకు మెమోలు ఇచ్చిన ఘనత రేవంత్ సర్కారుది. ఊరూరికి మైక్రో బ్రూవరీ తెచ్చి తాగుబోతుల తెలంగాణ చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా రేవంత్ రెడ్డి? అడ్డదారులు తొక్కడం, ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడటం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారింది. రాష్ట్రంలో మద్యపాన నిషేధం తప్పదనే రీతిలో ఆనాడు బిల్డప్ ఇచ్చి ఈనాడు ఊరూరా మైక్రో బ్రూవరీలు తెస్తున్నాడు అని హరీశ్‌రావు దుయ్యబట్టారు. మహిళలకు కల్యాణ లక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తానని ఇవ్వలేదు. యువతులకు నెలకు 2500 ఇస్తానని ఇవ్వలేదు. ఇవేమీ చేయకుండా బెల్ట్ షాపులు పెంచి మహిళల ఉసురు పోసుకుంటున్నావ్. అప్పుల పాలైనా, గ్యారంటీల అమలు అయినా, మద్యం అమ్మకాలైనా ఏవైనా రేవంత్ రెడ్డిది రెండు నాలుకల ధోరణి. గౌడ సోదరులకు వైన్



షాపుల్లో 25 శాతం రిజర్వేషన్లు అని ఊదరగొట్టి .. కేసీఆర్ ఇచ్చిన 15 శాతం రిజర్వేషన్ కూడా ఇవ్వడం లేదు. నీరాను ప్రోత్సహిస్తామన్నారు.. ఉన్న నీరా షాపును బంద్ చేసే కుట్ర చేశారు. వారం రోజుల్లో నష్టపరిహారం ఇస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి.. గీత కార్మికులు ప్రమాదావశాత్తు చనిపోతే ఇచ్చే నష్టపరిహారాన్ని ఇప్పటివరకు చెల్లించడం లేదు. గౌడన్నలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రాత్రికి రాత్రే మద్యం షాపులు ఒక చోటు నుంచి మరో చోటుకు తరలించే వెసులుబాటు ఎందుకు కల్పించారు ? పల్లెపల్లెకు మద్యం చేర్చడంపై ఉన్న శ్రద్ధ పల్లెపల్లెకు వైద్యాన్ని అందించడంపై లేదు. రాష్ట్రంలో నాసిరకం మద్యం బ్రాండ్లను విచ్చలవిడిగా అనుమతించి మద్యం ఆదాయం పెంచుకోవాలనే స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం దిగజారింది. వందలకొద్దీ కొత్త బ్రాండ్లు వస్తున్నాయి అంటున్నారు, అడ్డగోలుగా బ్రాండ్లను పెంచి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతారా..? యూరియా ఇవ్వరు కానీ ఊరి ఊరికో మద్యం దుకాణం ఇస్తాం తీసుకోండి అంటోంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం. ఇది రేవంత్ రెడ్డి బరితెగింపు పాలనకు నిదర్శనం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. పబ్బులు, క్లబ్బుల గురించి గబ్బుగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.. పబ్బులకు అనుమతి రద్దు చేయకపోగా కొత్త పబ్బులకు పర్మిషన్ ఇస్తూ కమిషన్లు దండుకుంటున్నాడు. రేవంత్ రెడ్డి నువ్వు ఓ యూ టర్న్ సీఎం. ఎన్నికల్లో చెప్పింది ఒకటి ఇప్పుడు చేస్తున్నది మరొకటి. మైక్రోబ్రూవరీల ఆలోచన మానుకో రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు హెచ్చరించారు.

## ఐదుగురు వైద్యుల సస్పెన్షన్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు) : సరైన అర్హతలు లేకుండా వైద్యం చేయడంతోపాటు ఆర్ఎంపీలకు మద్దతుగా నిలవడంతో క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఐదుగురు వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సస్పెన్షన్ వేటు వేసింది. ఈ మేరకు శుక్రవారం టీఎంసీ ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా ఇండియన్ మెడికల్ కౌన్సిల్, తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్‌ను ఉల్లంఘించినట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. వీరిలో చైతన్యరెడ్డి (ఆక్సికేర్ హాస్పిటల్, ఈసీఐఎల్), గౌతమ్‌రెడ్డి(ఓమ్ని హాస్పిటల్, కొత్తపేట్), మల్లికార్జునరావు (ఇవ్యా హాస్పిటల్, వనస్థలిపురం), ఉమామహేశ్వర్ (పద్మావతి న్యూరో అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సంగారెడ్డి)పై ఆరు నెలలు సస్పెన్షన్ వేటు వేసింది. కన్నయ్య తల్లపల్లి (లివ్‌యంగ్ క్లినిక్, జూబ్లీహిల్స్)పై ఏడాదిపాటు సస్పెన్షన్ వేటు వేసింది. వీరంతా వారి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను పది రోజుల్లోగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో అందజేయాలని నోటీసులలో ఆదేశించింది.

# అరెస్టు చేసుకున్నా ఫర్వాలే: కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): కాంగ్రెస్ నేతలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి ధ్వజమెత్తారు. తన అరెస్టుపై కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారని కేటీఆర్ పేర్కొన్నారు. చూసి చూసి వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఎల్ అండ్ టీ సంస్థపై మీడియాతో మాట్లాడిన సందర్భంగా కేటీఆర్ అరెస్టుపై ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు ఈ విధంగా బదులిచ్చారు. రేవంత్ రెడ్డి ఏం చేసినా దాని వెనుకాల ఓ స్కీమ్ ఉంటది.. దాని వెనుకాల ఓ స్కాం ఉంటుంది. ఇది పక్కా.. ఆయన పేరుకే ముఖ్యమంత్రి కానీ ఆయన దందా బ్లాక్ మెయిల్. ఇవాళ చెప్పింది చిన్న విషయం.. ఇంకో నాలుగైదు రోజుల్లో ఒక పెద్ద విషయం కూడా చెబుతాను. ఇంకో కార్పొరేట్ సంస్థను ఎట్ల బ్లాక్ మెయిల్ చేశాడో అది కూడా చెప్తాను.



ఆధారాలతో సహా చెప్తాను అని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెసోళ్లు రెండేండ్లుగా కలలు కంటూనే ఉన్నారు. వాళ్ల కళ్లు కాయలు కాస్తున్నాయి. మమ్మల్ని అరెస్టు చేసుకుంటారా.. ఏం చేసుకుంటారో చేస్కోండి.. నేను ఏ తప్పు చేయలేదు. ఎంత ధైర్యం ఉంటే.. నేను ఒక మంత్రిగా పదేండ్లు పని చేశాను.. లై డిటెక్టర్ టెస్టుకు సిద్ధమని చెప్పాను. సీఎంను అడిగాను.. ఆయన స్పందించలేదు. ఏసీబీ కేసు ఇద్దరి మీద ఉంది.. మీ కెమెరాల ముందే లైడిటెక్టర్ టెస్ట్ తీసుకుంటా రండి అని చెప్పాను. ఇప్పుడు కూడా అదే ఆఫర్ ఇస్తున్నా.. నేను తప్పు చేయలేదు కాబట్టి నిజాయితీకి ధైర్యం ఎక్కువ.. నేను తప్పు చేయలేదు కాబట్టి నాకు ఆధైర్యం ఉంది. అరెస్టు చేసుకుంటారా..? ఏం చేసుకుంటారో వదిలేయండి. నన్ను అరెస్టు చేస్తే పైశాచిక ఆనందం వస్తుండొచ్చు సీఎం రేవంత్ రెడ్డికి అది కూడా ఒకే. కానీ మేం కాంగ్రెస్ పార్టీని వదిలిపెట్టం.. 4 వేల పెన్షన్.. తులం బంగారం, స్కూటీ ఇవన్నీ ఇచ్చేదాకా కాంగ్రెస్ ను వెంటాడుతూనే ఉంటాం.. నీవెన్ని డైవర్షన్ గేమ్‌లు ఆడినా మేం వదిలిపెట్టం కాంగ్రెస్ పార్టీని అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## జర్నలిస్టుల అక్రిడేషన్ల గడువు మళ్లీ పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు) : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువును మరో మూడు నెలల పాటు పొడిగించారు. ఈ మేరకు ఐ అండ్ పీఆర్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 30వ తేదీతో ముగియనున్న అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని డిసెంబర్ 31వ తేదీ వరకు పొడిగించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్తగా అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయలేదు. గత 22 నెలలుగా అక్రిడేషన్ కార్డుల కాల పరిమితిని ప్రతి మూడు నెలలకు ఒకసారి పొడిగిస్తూనే ఉంది. అక్రిడేషన్ కార్డుల గడువు పొడిగించడం ఇది ఆరోసారి కావడం గమన్హరం.

## బీఆర్ఎస్ సీనియర్లతో కేసీఆర్ భేటీ

గజ్వేల్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): బీఆర్ఎస్ సీనియర్ నాయకులతో పార్టీ అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు. ఎర్రవల్లి నివాసంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, మహమూద్ అలీ, పద్మారావు గౌడ్, సబితా రెడ్డితో భేటీ అయ్యారు. ఇదిలా ఉండగా.. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా మాగంటి సునీత గోపీనాథ్‌ను కేసీఆర్ ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో, త్వరలో జరుగనున్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో.. పార్టీలో సీనియర్ నేతగా, జూబ్లీ హిల్స్ ప్రజల అభిమాన నాయకుడిగా స్థానం సంపాదించుకున్న దివంగత మాగంటి గోపినాథ్ సతీమణి మాగంటి సునీతకే ప్రాధాన్యతనిస్తూ వారిని అభ్యర్థిగా ఎంపిక చేశారు. చిత్తశుద్ధి కలిగిన నిస్వార్థ నేతగా, వారి నిబద్ధతను పరిశీలించిన మీదట, మాగంటి గోపీనాథ్ పార్టీకి, ప్రజలకు అందించిన సేవలకు గుర్తింపు, గౌరవాన్నిస్తూ జూబ్లీహిల్స్ ప్రజల ఆకాంక్షల మేరకు దివంగత గోపీనాథ్ కుటుంబానికే అవకాశం ఇవ్వాలని కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

## 100 కోట్ల కోసం వరల్డ్ బ్యాంకుకు ఎమ్మెల్యే లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల ఎల్లారెడ్డి నియోజకవర్గం పూర్తిగా దెబ్బతిందని, ప్రకృతి విపత్తు పరిహారం కింద రూ.100 కోట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రపంచ బ్యాంకుకు లేఖ రాశారు. ఈ లేఖపై ప్రస్తుతం సెటైర్లు పేలుతున్నాయి. కారణం ఏంటంటే.. వరల్డ్ బ్యాంక్ ప్రభుత్వాల నుండి వినతులు తీసుకుంటుందే తప్ప ఇలా ప్రజా ప్రతినిధుల నుండి వినతులు తీసుకోదు. ఈ విషయం సదరు ఎమ్మెల్యేకు తెలియదా? అంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## కేసీఆర్ ఆరోగ్యంపై అసత్యప్రచారం: బీఆర్ఎస్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): కేసీఆర్ అనారోగ్యంపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండించింది. కొన్ని మీడియా ఛానళ్లు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్‌పై అసత్య ప్రచారాలు చేస్తూ.. ఆయన ఆరోగ్యంపై ఫేక్ వార్తలు పుట్టిస్తున్నాయని మండిపడింది. కేసీఆర్ ఆరోగ్యంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని బీఆర్ఎస్ పార్టీ కోరింది. కేసీఆర్ పూర్తిగా ఆరోగ్యంగా ఉన్నారని స్పష్టం చేసింది. ఇవాళ ఎర్రవల్లి నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు సీనియర్ నేతలు హరీశ్‌రావు, మహమూద్ అలీ, పద్మారావు గౌడ్, సబితా ఇంద్రారెడ్డితో సమావేశమయ్యారని తెలిపింది. మీడియా సంస్థలు వాస్తవాల ఆధారంగా మాత్రమే వార్తలు ప్రసారం చేయాలని విజ్ఞప్తి చేసింది.

## ఇక టికెట్ల రేట్లు పెంచేదేలే

**మంత్రి కోమటిరెడ్డి వెల్లడి**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ సినిమా టికెట్ రేట్ల పెంపుపై రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు తెలియకుండానే ఓజీ సినిమాకు సంబంధించిన టికెట్ రేట్ల పెంపు జీవోను జరిగిందని.. పక్క రాష్ట్రంలో (ఆంధ్రప్రదేశ్) ఈ సినిమాకు జీవో ఇచ్చారు కాబట్టి, ఇక్కడ కూడా ఇచ్చారు అనుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. ఇకపై రాష్ట్రంలో సినిమా టికెట్ రేట్లు పెంచడం జరగదని చిన్న సినిమాలు అయినా, పెద్ద సినిమాలు అయినా ఒక్కటే టికెట్ రేటు అమలు చేస్తాం అని మంత్రి ప్రకటించారు. అనంతరం సినిమా టికెట్ రేట్ల పెంపుపై తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్వాగతించారు. 'ఓజీ' సినిమా టికెట్ ధరల పెంపును అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను తెలంగాణ హైకోర్టు బుధవారం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఓజీ ప్రీమియర్ షో టికెట్ ధర రూ. 800 పెంపుతో పాటు సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 4 వరకు రెగ్యులర్ షోలకు సింగిల్ స్క్రీన్‌లలో రూ. 100, మల్టీప్లెక్స్‌లలో రూ. 150 పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే ఈ ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. టికెట్ ధరలను సాధారణ రేట్లకే విక్రయించాలని న్యాయస్థానం ఆదేశించింది.

## రద్దీగా హైదరాబాద్-విజయవాడ హైవే



పంతంగి, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): దసరా పండుగ సెలవుల నేపథ్యంలో హైదరాబాద్ నగరం నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తమ సొంతూళ్లకు పయనమయ్యారు. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగింది. పండుగను కుటుంబ సభ్యులతో జరుపుకునేందుకు వెళ్తున్న ప్రయాణికులతో రహదారి కిక్కిరిసిపోయింది. ముఖ్యంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. వాహనాలు నెమ్మదిగా కదలడంతో ప్రయాణ సమయం పెరిగింది. చౌటుప్పల్, పెద్దకాపర్తి, చిట్యాల వంటి ప్రాంతాల్లోనూ అధిక రద్దీ కనిపిస్తోంది. సొంత కార్లు, ఇతర ప్రైవేట్ వాహనాల్లో ప్రజలు భారీగా బయలుదేరడమే ఈ రద్దీకి ప్రధాన కారణంగా కనిపించింది. మరోవైపు, నగరంలోని ప్రధాన బస్ స్టేషన్లు కూడా ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పండుగ కోసం ప్రభుత్వం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉండటంతో బస్టాండ్లన్నీ జనంతో నిండిపోయాయి. సొంత వాహనాల్లో వెళ్లేవారు, బస్సుల్లో ప్రయాణించేవారితో హైదరాబాద్ నుంచి బయటకు వెళ్లే అన్ని మార్గాల్లోనూ పండుగ సందడితో పాటు ట్రాఫిక్ రద్దీ నెలకొంది.



# వర్క్ ఫ్రమ్ హోమ్ ఇవ్వండి

## ఐటీ కంపెనీలకు హైదరాబాద్ పోలీసుల సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో హైదరాబాద్ నగరాన్ని భారీ వర్షం ముంచెత్తింది. గురువారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానకు నగర జీవనం స్తంభించిపోయింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నగరంలోని ఐటీ కంపెనీలకు కీలక సూచనలు జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా ఉద్యోగులకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' ప్రకటించాలని కోరారు. నగరంలోని అమీర్‌పేట్, కూకట్‌పల్లి, మియాపూర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్టతో పాటు సికింద్రాబాద్, ఉప్పల్, ఎల్బీనగర్, దిల్‌సుఖ్‌నగర్, ఖైరతాబాద్ వంటి అన్ని ప్రధాన ప్రాంతాల్లోనూ ఏకధాటిగా వర్షం కురుస్తోంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులన్నీ చెరువులను తలపిస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఎవరూ ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఐటీ కారిడార్లలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు కంపెనీలు సహకరించాలని, ఉద్యోగులకు ఇంటి నుంచి పనిచేసే వెసులుబాటు కల్పించాలని తెలిపారు. ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమవడం వల్లే తెలంగాణ వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు పడుతున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

## కోల్ ఇండియా కార్మికులకు

# రూ.1,03,000

**2.47 లక్షల మంది కార్మికులకు ప్రోత్సాహకం**

**వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



న్యూఢిల్లీ: సింగరేణి ఉద్యోగులకు కోల్ ఇండియా దసరా బోనస్‌ను ప్రకటించింది. ఉద్యోగుల పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థల్లోని 2.09 లక్షల మంది కార్మికులు, సింగరేణి కాలరీస్‌లోని 38,000 మంది కార్మికుల కృషికి గుర్తింపుగా ఒక్కొక్కరికి రూ. 1,03,000 చొప్పున పనితీరు ఆధారిత ప్రోత్సాహకాన్ని అందజేయనున్నట్లు కిషన్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం అనేక చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. ఇందులో ఉద్యోగుల బీమా కవరేజీని రూ. 1 కోటికి పెంచడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచామని తెలిపారు. ఉద్యోగులు ఎలాంటి బీమా ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. శాశ్వత ఉద్యోగులు కానివారికి కూడా బీమా రక్షణ కల్పించామని చెప్పారు. తమ నిర్ణయాలు ఉద్యోగుల సమగ్ర సంక్షేమం వైపు ఒక ముందడుగు అని కిషన్ రెడ్డి అభివర్ణించారు. ఎక్స్‌గ్రేషియాను కూడా రూ. 15 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచిన విషయాన్ని గుర్తు చేశారు. కోల్ ఇండియా, దాని అనుబంధ సంస్థలలో సీఎండీ నుంచి కార్మికుడి వరకు అందరికీ డ్రెస్ కోడ్ తీసుకువచ్చామని తెలిపారు. పండుగ సమయంలో ప్రభుత్వం ప్రకటించిన ఈ పనితీరు ప్రోత్సాహకం ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పాలనకు నిదర్శనమని అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వం, మార్గనిర్దేశనం తమకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని కిషన్ రెడ్డి అన్నారు. కోల్ ఇండియా పరివార్ భారతదేశం యొక్క బలాన్ని నిరూపించిందని ఆయన కొనియాడారు. కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి, ప్రతి ఒక్కరికీ సురక్షితమైన భవిష్యత్తును నిర్మించడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నరేంద్ర మోదీ 'సంస్కరణ, పనితీరు, పరివర్తన' అనే మంత్రం బొగ్గు రంగాన్ని సరికొత్త సంకల్పంతో ముందుకు తీసుకు వెళ్లడానికి ఊతమిస్తుందని ఆయన పేర్కొన్నారు

## మూసారాంబాగ్ బ్రిడ్జి మూసివేత

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా మూసారాంబాగ్ బ్రిడ్జిపై నుంచి మూసీ వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మూసారాంబాగ్ బ్రిడ్జిపైకి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఉస్మాన్ సాగర్ పూర్తిగా నిండిపోవడంతో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో మూసారాంబాగ్ బ్రిడ్జి వద్ద రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బ్రిడ్జి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. దిల్‌సుఖ్ నగర్ వైపు నుంచి వచ్చే వాహనాలను గోల్నాక కొత్త బ్రిడ్జి వైపు మళ్లిస్తున్నారు. నగరంలో కురిసిన భారీ వర్షానికి నగరవాసులు తడిసి ముద్దయ్యారు. కార్యాలయాల నుంచి ఇంటికి వెళ్లేవారు, పనుల కోసం బయటకు వచ్చిన వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బేగంబజార్, కోఠి, నాంపల్లి, హిమయత్ నగర్, ఖైరతాబాద్, ట్యాంక్‌బండ్, సికింద్రాబాద్ మొదలైన ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లోకి భారీగా వరద నీరు చేరుతోంది. వరద నీరు గంట గంటకు పెరుగుతుండటంతో రెండు జలాశయాల గేట్లను ఎత్తి మూసీ నదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. దీనితో పురానాపూల్, చాదర్ ఘాట్, మూసారాంబాగ్ వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. మూసీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



## సోషల్ వాణి



ఎమ్మెల్యేగానే ప్రపంచ బ్యాంకుకు లెటర్లు రాసిండు. ఐటీ మంత్రి అయితే అంతరిక్షంలో ఏలియన్స్‌కే లెటర్లు రాసి ఉద్ధరించేస్తాడేమో అని హైకమాండ్ ఆపిందేమో. జర్రల మిస్సైంది.

\- పాశం రఘునందన్ రెడ్డి

## బోనమెత్తిన జైతాల




జగిత్యాల నవదుర్గాపీఠ క్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతరకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



## చెరువులో ఊరేగిన దుర్గమ్మ

మల్యాల నవదుర్గాసేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా తెప్పోత్సవం నిర్వహించారు. పుష్కరిణి(చెరువు)లో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం కన్నులపండువగా జరిగింది.

## హారతి పట్టిన భక్తజనం



జగిత్యాల కనకదుర్గాసేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గానవరాత్రులకు భక్త జనం కదిలి వచ్చారు. అమ్మవారి ముందు చిన్నారులు చేసిన క్లాసికల్ డ్యాన్స్ అలరించింది.

## సమర్థంగా స్థానిక ఎన్నికల నిర్వహణ

**జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): స్థానిక ఎన్నికలను సమర్థంగా నిర్వహించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మెట్‌పల్లిలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని అన్నారు. అన్ని అంశాలపై అవగాహన పెంచుకొని అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఏవైనా అనుమానాలు, ఇబ్బందులు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఓటర్లకు ఇబ్బంది రాకుండా పోలింగ్ కేంద్రాల వద్ద సరిపడా స్ట్రాంగ్ రూములు, బ్యాలెట్ బాక్సులు, తాగునీరు, మరుగుదొడ్లు, వీల్ చైర్లు తదితర సౌకర్యాలతో పాటు ఎన్నికల నిర్వహణకు అవసరమైన సామగ్రి ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎన్నికల వేళ పొరపాట్లకు తావివ్వకుండా ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ పారదర్శకంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజా గౌడ్, జడ్పీ డిప్యూటీ సీఈవో, మాస్టర్ ట్రైనర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## క్రెడిట్ కార్డు మోసాలపై జాగ్రత్త: ఎస్పీ

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): ఈ మధ్య కాలంలో ఆన్‌లైన్ క్రెడిట్ కార్డ్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయని, గుర్తు తెలియని నంబర్ల నుండి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. లింకులను నమ్మి ఎవ్వరూ తమ క్రెడిట్ కార్డ్ వివరాలు, ఓటీపీలు, పిన్ నంబర్లు చెప్పకూడదని అన్నారు. ప్రజలు జాగ్రత్తలు పాటించకపోతే పెద్ద మొత్తంలో ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని, బ్యాంకులు ఎప్పుడూ ఫోన్ లేదా సందేశం ద్వారా వ్యక్తిగత వివరాలు అడగవు అని స్పష్టం చేశారు. అలాంటి కాల్స్ వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కి సమాచారం ఇవ్వాలన్నారు.

# నవరాత్రులను అపవిత్రం చేస్తే చర్యలు తీసుకోవాలి

**వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ బాలస్వామి**



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కూడుకున్నవని, అయితే కొన్ని దుష్టశక్తులు నవరాత్రులను అపవిత్రం చేస్తున్నాయని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. నియమనిష్ఠలతో, భక్తిశ్రద్ధలతో పాటలు పాడుతూ.. నృత్యాలు చేస్తూ.. అమ్మవారిని ఆరాధించే సంస్కృతి నుంచి, ఈవెంట్ కల్చర్ ప్రోగ్రామ్స్ పేరుతో దుర్గా పూజలను అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి మాఫియాపై చర్యలు తీసుకోవాలని బాలస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దుర్గామాత నవరాత్రులను కార్పొరేట్ పద్ధతిలో న్యూ ఇయర్ ఈవెంట్ మాదిరి కార్యక్రమాలు నిర్వహించడం హిందూ సంస్కృతికి బద్ధ విరుద్ధమని పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ పత్రిక ప్రకటన విడుదల చేశారు. హిందువులందరూ వాస్తవాలను గ్రహించి, భక్తిశ్రద్ధలతో జరిగే కార్యక్రమాలలో మాత్రమే పాల్గొనాలని సూచించారు. అన్య మతస్తులు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు విశ్వహిందూ పరిషత్ సిద్ధంగా ఉందని హెచ్చరించారు. నిర్వాహకులు అందరూ హిందువులై ఉండాలని, ప్రతి ఈవెంట్లో దుర్గామాత పూజలు నియమ నిష్ఠలతో నిర్వహించాలన్నారు. నవరాత్రులను అవహేళన చేసే విధంగా అమాయక హిందువులను ప్రలోభాలకు గురిచేస్తూ..డబ్బు సంపాదించుకునే ఈవెంట్ మేనేజర్ల వ్యవహారం బయటపెట్టాలని పోలీసులను డిమాండ్ చేశారు. ప్రతి ఈవెంట్ కు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, లేదంటే అసభ్యకరమైన ఈవెంట్లను అడ్డుకొని తీరుతామని బాలస్వామి హెచ్చరించారు. ఈవెంట్ నిర్వాహకుల వివరాలు పోలీసులు తప్పనిసరిగా వెరిఫై చేయాలని డిమాండ్ చేశారు.



## నిజాం ఫ్యాక్టరీతో వేల రైతులకు లబ్ధి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి.. చెరుకు రైతులతో ముఖాముఖి సమావేశం**

మల్లాపూర్/జగిత్యాల, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంతో వేల మంది చెరుకు రైతులకు లబ్ధి చేకూరుతుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని పరిశీలించిన ఆయన.. రైతులతో ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు ఫ్యాక్టరీ ప్రైవేట్ ఆధీనంలో ఉండగా, ప్రభుత్వం ఫ్యాక్టరీపై ఉన్న 172 కోట్ల బకాయిలు తీర్చిందని వివరించారు. పునః ప్రారంభించడానికి కావలసిన సాంకేతిక, స్థానిక సమస్యలను అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తారని తెలిపారు. ఈ ఫ్యాక్టరీ పునఃప్రారంభమైతే జగిత్యాల జిల్లాలోని మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్పల్లి, కోరుట్ల, కథలాపూర్, జగిత్యాల మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని కొన్ని మండలాలు, నిర్మల్ జిల్లాలోని కొన్ని మండలాల రైతులకు లబ్ధి చేకూరుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, పరిశ్రమల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, వ్యవసాయ శాఖ స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ ఆఫ్ షుగర్ ఇండస్ట్రీస్ సిహెచ్ నర్సిరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఐలమ్మది ఆత్మగౌరవ పోరాటం



వేములవాడ, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం, ఆత్మ గౌరవం కోసం, సమానత్వం కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ అని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారత సంఘం అధ్యక్షుడు పొలాస నరేందర్ అన్నారు. ఐలమ్మ 130వ జయంతిని పురస్కరించుకొని వేములవాడ తెలంగాణ చౌక్ లోనీ చాకలి ఐలమ్మ విగ్రహానికి బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ.. ఐలమ్మ త్యాగాలు, పోరాటాలు మరువలేనివని, ఆమె జీవితం భావి తరాలకు మార్గదర్శనం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం నేతలు యేస తిరుపతి, మల్యాల దేవయ్య, కనపర్తి సుధాకర్, పోతారం రాజబోసు, సీహెచ్ రామస్వామి గౌడ్, సంకుర్తి భూమయ్య, దురిషెట్టి నాగరాజు, కనపర్తి శ్రీనివాస్, డాక్టర్ అంజయ్య, మూలికాల భాస్కర్, సంకూర్తి రాజయ్య, మ్యాన రాజేశ్, ఎట్టెం సాయి కృష్ణ, ఎద్దండి రాము తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి సంఘానికి 5 లక్షల ప్రొసీడింగ్



పెగడపల్లి, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): పెగడపల్లి పద్మశాలి సంఘ భవనం నిర్మాణ పనుల కోసం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ రూ.5 లక్షల ప్రొసీడింగ్ కాపీని ఆ సంఘ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రికి సంఘం నేతలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, ఓరుగల శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెగడపల్లి మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాజుల గంగమల్లేశం, కార్యదర్శి భోగ గంగాధర్, క్యాషియర్ భోగ గోపి, యూత్ అధ్యక్షుడు సాంబారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## కమ్యూనిటీ భవనం, ఐకేపీ సెంటర్ కోసం వినతి

పెగడపల్లి, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): పెగడపల్లి మండల కేంద్రంలో గిరిజన బంజారా సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారా కమ్యూనిటీ భవన్ నిర్మాణం కోసం 15 – 20 గుంటల ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఎమ్మార్వో కుమార్‌ను గిరిజన బంజారా సంఘం నేతలు కోరారు. ఎమ్మార్వోను కలిసినవారిలో గిరిజన బంజారా సంఘం ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షుడు నగావత్ జీవన్ నాయక్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ నగావత్ శ్రీను నాయక్, గిరిజన సంఘం పెగడపల్లి మండల అధ్యక్షుడు నగావత్ తిరుపతి నాయక్, ఇస్లావత్ అంజి నాయక్ తదితరులు ఉన్నారు.

## దుర్గ గుడికి నూతన పాలకమండలి

**16 మంది సభ్యులను నియమించిన ప్రభుత్వం**

విజయవాడ, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి నూతన పాలకమండలిని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ కమిటీలో మొత్తం 16 మందిని సభ్యులుగా నియమించింది. కొద్ది రోజుల క్రితమే ఆలయ చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణను నియమించిన ప్రభుత్వం, తాజాగా పూర్తిస్థాయి కమిటీని ప్రకటించింది. ఈ పాలకమండలిలో అధికార కూటమికి చెందిన తెలుగుదేశం, జనసేన, బీజేపీల నాయకులకు స్థానం కల్పించారు. సభ్యులతో పాటు మరో ఇద్దరిని ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించడం గమనార్హం. కొత్తగా నియమితులైన సభ్యులు త్వరలోనే చైర్మన్ ఆధ్వర్యంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యంగా ఈ కమిటీ పనిచేయనుంది.

**పాలకమండలి సభ్యులుగా నియమితులైన వారు:**

1. అవ్వారు శ్రీనివాసరావు (విజయవాడ వెస్ట్ – బీజేపీ)
2. బడేటి ధర్మారావు (విజయవాడ సెంట్రల్ – టీడీపీ)
3. గూడపాటి వెంకట సరోజినీ దేవి (మైలవరం – టీడీపీ)
4. జీవీ నాగేశ్వరరావు (రేపల్లె – టీడీపీ)
5. హరికృష్ణ (హైదరాబాద్ – టీడీపీ తెలంగాణ)
6. జింకా లక్ష్మీ దేవి (తాడిపత్రి – టీడీపీ)
7. మన్నె కళావతి (నందిగామ – టీడీపీ)
8. మోరు శ్రావణి (దెందులూరు – టీడీపీ)
9. పద్మావతి ఠాకూర్ (విజయవాడ వెస్ట్ – జనసేన)
10. పనబాక భూలక్ష్మి (నెల్లూరు రూరల్ – టీడీపీ)
11. పెనుమత్స రాఘవ రాజు (విజయవాడ సెంట్రల్ – బీజేపీ)
12. ఏలేశ్వరపు సుబ్రహ్మణ్య కుమార్ (విజయవాడ ఈస్ట్)
13. సుకాశి సరిత (విజయవాడ వెస్ట్ – టీడీపీ)
14. తంబాళపల్లి రమాదేవి (నందిగామ – జనసేన)
15. తోటకూర వెంకట రమణా రావు (తెనాలి – జనసేన)
16. అన్నవరపు వెంకట శివ పార్వతి (పెనమలూరు – టీడీపీ)

**ప్రత్యేక ఆహ్వానితులు:**

1. మార్తి రమా బ్రహ్మం (విజయవాడ ఈస్ట్)
2. వెలగపూడి శంకర్ బాబు (పెనమలూరు – టీడీపీ)




## హత్య కేసులో నిందితుడి అరెస్టు

జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 26 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని స్వప్న బార్‌లో ఈనెల 25న అర్ధరాత్రి జరిగిన హత్యకేసులో నిందితుడు చరణ్ జీత్ సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు జగిత్యాల డిఎస్పీ రఘుచందర్ తెలిపారు. నిందితుడిని శుక్రవారం మధ్యాహ్నం హస్నాబాద్ శివారులోని శివాజీ ఇసుక డంపు వద్ద అదుపులోకి తీసుకున్నామని వెల్లడించారు. ఒకే రోజులో నిందితుడిని పట్టుకున్న టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, ఎస్సైలు రవికిరణ్, కుమారస్వామి, పోలీస్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.



జగిత్యాల జిల్లా మల్యాల మండల శ్రీ మారమాంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారు గాజుల అలంకరణ రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు అమ్మవారికి అంగరంగ వైభవంగా కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మాతలు పాల్గొన్నారు.
- ఈవార్తలు (మల్యాల)



దేవి నవరాత్రులలో భాగంగా ఐదవ రోజు పెగడపల్లిలో అమ్మవారి కుంకుమమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కమటం మల్లయ్య, బేతి సత్యనారాయణ, తొంటి నారాయణ, బాలుసాని లచ్చగౌడ్, శ్రీనివాస్ గౌడ్, పెయ్యాల రాజు, గాలిపెల్లి రాజమౌళి, ముంజ రమణ, పెయ్యాల శ్రీధర్, పేపర్ల శ్రీధర్, భక్తులు పాల్గొన్నారు.
- ఈవార్తలు (పెగడపల్లి)

# మహిళలకు రూ.10 వేలు

## బీహార్‌లో ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన.. బటన్ నొక్కి నిధులు విడుదల చేసిన ప్రధాని మోదీ

**తొలి దశలో 75 లక్షల మంది మహిళలకు ఆర్థిక సాయం**



న్యూఢిల్లీ/పాట్నా: బీహార్‌లో మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీయే ప్రభుత్వం ఓ కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ పథకం కింద తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ. 10,000 చొప్పున జమ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఒకేసారి మొత్తం రూ. 7,500 కోట్లను లబ్ధిదారులకు బదిలీ చేశారు. ఈ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమం పాట్నాలో జరగ్గా, ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పాట్నాలోని కార్యక్రమంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కొందరు లబ్ధిదారులతో ముచ్చటించారు. మహిళల సాధికారత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇంత పెద్ద కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని కొనియాడారు. గత పదేళ్లలో దేశవ్యాప్తంగా 30 కోట్లకు పైగా జన్ ధన్ ఖాతాలు తెరవడం వల్లే ఇప్పుడు ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నిధులు జమ చేయగలుగుతున్నామని ప్రధాని మోదీ గుర్తుచేశారు. "ఒకప్పుడు కేంద్రం 100 రూపాయలు పంపిస్తే, ప్రజలకు చేరేసరికి 15 రూపాయలే మిగిలేవని ఓ మాజీ ప్రధాని చెప్పారు. కానీ ఈ రోజు, ప్రతి రూపాయి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వెళుతోంది" అని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మాట్లాడుతూ, మహిళల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "ఇప్పుడు అందించిన రూ. 10,000 సాయంతో వ్యాపారంలో రాణించిన మహిళలకు భవిష్యత్తులో రూ. 2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తాం" అని ఆయన హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ సంస్థల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు, కోటికి పైగా జీవికా దీదీలతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళల జీవితాలను మార్చామని నితీశ్ కుమార్ వివరించారు. ఇదే సమయంలో ఆయన ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌పై పరోక్ష విమర్శలు చేశారు. 2005కు ముందు రాష్ట్రాన్ని పాలించిన వారు, పదవి పోగానే తమ భార్యను ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెట్టారని ఎద్దేవా చేశారు. మొత్తం 3.06 కోట్ల దరఖాస్తులు రాగా, తొలి దశలో 75 లక్షల మందిని ఎంపిక చేసినట్లు ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి తెలిపారు. 2025లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎన్డీయే ప్రభుత్వం ఈ భారీ పథకాన్ని ప్రారంభించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# ముగిసిన మిగ్ 21 శకం

**62 ఏళ్ల సేవకు ఘన వీడ్కోలు**

**చండీగఢ్‌లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం**

**చివరి విమానాన్ని నడిపిన ఎయిర్ ఫోర్స్ చీఫ్ ఏపీ సింగ్**

**వేడుకకు హాజరైన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**



చండీగఢ్: భారత వాయుసేన చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం ముగిసింది. సుమారు 62 ఏళ్ల పాటు దేశ రక్షణలో కీలక పాత్ర పోషించిన చారిత్రాత్మక మిగ్-21 యుద్ధ విమానాలు సేవల నుంచి శాశ్వతంగా వైదొలిగాయి. ఈ సందర్భంగా చండీగఢ్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో ఈ రోజు అత్యంత భావోద్వేగపూరిత వాతావరణంలో వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ స్వయంగా మిగ్-21 విమానంలో చివరిసారిగా ప్రయాణించి ఈ శకానికి ముగింపు పలికారు. ఈ వీడ్కోలు కార్యక్రమానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్, ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది, నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె త్రిపాఠి తదితర త్రివిధ దళాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 'పాంథర్స్' అనే ముద్దుపేరున్న 23వ స్క్వాడ్రన్‌కు చెందిన చివరి మిగ్-21 విమానాలకు సైనిక లాంఛనాలతో వీడ్కోలు పలికారు. విమానాలు ల్యాండ్ అయిన తర్వాత వాటర్ క్యానన్ సెల్యూట్‌తో గౌరవ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్న స్క్వాడ్రన్ లీడర్ ప్రియా శర్మ, మిగ్-21 నడిపిన చివరి మహిళా ఫైటర్ పైలట్‌గా నిలిచారు. పాత తరం పైలట్లు సైతం ఈ కార్యక్రమానికి హాజరై, మిగ్-21తో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని భావోద్వేగానికి లోనయ్యారు. ఇకపై మిగ్-21 స్థానంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్' సేవలు అందించనుంది. "ఆరు దశాబ్దాల సేవ, లెక్కలేనన్ని ధైర్యసాహసాల గాథలు, దేశ గర్వాన్ని ఆకాశానికి మోసుకెళ్లిన యుద్ధ అశ్వం" అంటూ భారత వైమానిక దళం మిగ్-21కు ఘన నివాళి అర్పించింది.

# నిజ్జర్ వారసుడు గోసల్ అరెస్టు

**కెనడాలో ఖలిస్థానీలకు మరో షాక్**



ఒట్టావా: ఖలిస్థానీ ఉగ్రవాద కార్యకలాపాలకు అడ్డాగా మారిన కెనడాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. హత్యకు గురైన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ వారసుడిగా భావిస్తున్న ఇందర్‌జీత్ సింగ్ గోసల్ (36) ను స్థానిక పోలీసులు అరెస్ట్ చేశారు. అక్రమంగా ఆయుధాలు కలిగి ఉన్నాడన్న ఆరోపణలపై అతడితో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన కెనడాలోని ఒషావాలో జరిగింది. వివరాల్లోకి వెళితే, సెప్టెంబర్ 19న ఒంటారియో ప్రావిన్షియల్ పోలీసులు (ఓపీపీ) హైవే 407 సమీపంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇందర్‌జీత్ గోసల్‌తో పాటు అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన జగ్దీప్ సింగ్ (41), టొరంటో నివాసి అర్మాన్ సింగ్ (23) లను అరెస్ట్ చేశారు. వారిపై నిర్లక్ష్యంగా ఆయుధాలు వినియోగించడం, ప్రమాదకరమైన ఆయుధాలు కలిగి ఉండటం, ఆయుధాలను దాచిపెట్టడం వంటి అభియోగాలపై కెనడా క్రిమినల్ కోడ్ కింద కేసులు నమోదు చేశారు. నిందితులను సెప్టెంబర్ 22న ఒషావాలోని ఒంటారియో కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని, ఎవరికైనా సమాచారం తెలిస్తే తమకు అందించాలని అధికారులు ప్రజలను కోరారు. ఇందర్‌జీత్ గోసల్ "సిక్స్ ఫర్ జస్టిస్" అనే వేర్పాటువాద సంస్థలో కీలకమైన వ్యక్తిగా పనిచేస్తున్నాడు. 2023 జూన్‌లో హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత ఖలిస్థానీ ఉద్యమంలో ఇతడు కీలకంగా మారాడు. సరిగ్గా వీరి అరెస్టు జరిగిన సెప్టెంబర్ 19వ తేదీనే భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, కెనడా భద్రతా సలహాదారు నథాలీ డ్రూయిన్‌తో సమావేశమయ్యారు. ఉగ్రవాదం, అంతర్జాతీయ నేరాలపై పరస్పరం సహకరించుకోవాలని ఈ భేటీలో ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. అదే రోజు ఈ అరెస్టు జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. కెనడా గడ్డపై నుంచి ఖలిస్థానీ ఉగ్రవాద కార్యకలాపాలు పెరిగిపోతున్నాయని భారత్ చాలాకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

# త్వరలో అమెరికాతో వాణిజ్య ఒప్పందం: కేంద్రం

న్యూఢిల్లీ: అమెరికాతో వీలైనంత త్వరలో వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య శాఖ తెలియజేసింది. ఇరు దేశాలకు మేలు చేకూరేలా, సాధ్యమైనంత త్వరగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించింది. వాణిజ్య సమస్యలపై చర్చల కోసం అమెరికాకు వెళ్లిన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. పరస్పర ప్రయోజనకర వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాల మధ్య చర్చలు సానుకూల దృక్పథంతో కొనసాగుతున్నాయని, ఈ చర్చలు ఫలప్రదమై త్వరలోనే ఒప్పందం ఖరారవుతుందనే సంకేతాలు కనిపిస్తున్నట్లు పేర్కొంది. వాణిజ్య ఒప్పందంలోని వివిధ అంశాలపై భారత ప్రతినిధి బృందం అమెరికా ప్రభుత్వంతో నిర్మాణాత్మక సమావేశాలు నిర్వహించినట్లు వాణిజ్య శాఖ వెల్లడించింది. అమెరికా కూడా భారత్‌లో తమ వ్యాపార కార్యకలాపాలను మరింతగా విస్తరించుకోవాలనే ఆలోచనను వ్యక్తం చేసినట్లు తెలిపింది. భారత్‌తో టారిఫ్ చర్చలు గొప్పగా జరుగుతున్నాయని అమెరికా వాణిజ్య కార్యదర్శి హొవార్డ్ లుట్నిక్ వెల్లడించారు. ఇరు దేశాలు సమష్టిగా ప్రయోజనాలను గుర్తించినట్లు తెలిపారు.

# బేబీ.. స్వీట్ గర్ల్..!

**దుబాయ్ చదివిస్తానని ఆశపెట్టి..**

**చైతన్యానంద స్వామిపై మాజీ విద్యార్థిని ఆరోపణలు**

న్యూఢిల్లీ: స్వయం ప్రకటిత బాబా చైతన్యానంద సరస్వతిపై లైంగిక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 17 మంది విద్యార్థినుల కేసులో పరారీలో ఉన్న ఆయనపై, 2016లో కేసు పెట్టిన ఒక బాధితురాలు తాజాగా సంచలన విషయాలు వెల్లడించారు. "చైతన్యానంద నా పట్ల రాబందులా వ్యవహరించాడు" అంటూ తన గోడును వెళ్లబోసుకున్నారు. 2016లో ఢిల్లీలోని శ్రీ శారద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్‌లో చేరినప్పుడు తన వయసు 20 ఏళ్లని, అది తన జీవితంలో అత్యంత భయంకరమైన సమయమని ఆమె తెలిపారు. "ఇనిస్టిట్యూట్‌లో చేరిన వెంటనే బాబా నాకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపడం మొదలుపెట్టాడు. నన్ను 'బేబీ', 'స్వీట్ గర్ల్' అని పిలిచేవాడు. సాయంత్రం 6:30 గంటలకు క్లాసులు ముగిశాక తన ఆఫీసుకు పిలిపించుకుని వేధించేవాడు" అని ఆమె ఆరోపించారు. తనలో ఎంతో ప్రతిభ ఉందని, దుబాయ్‌కి తీసుకెళ్లి తన సొంత ఖర్చులతో చదివిస్తానని చైతన్యానంద ఆశ చూపినట్లు బాధితురాలు వివరించారు. "నాకు అస్సలు ఇష్టం లేకపోయినా, అతడి సిబ్బంది నాపై ఒత్తిడి తెచ్చేవారు. నా మొబైల్ ఫోన్ లాక్కుని, హాస్టల్‌లో ఒంటరిగా ఉండేలా చేశారు. ఎవరితోనూ మాట్లాడనిచ్చేవారు కాదు. రాత్రిపూట నా గదిలోని ఫోన్‌కు కాల్ చేసేవాడు" అని ఆమె తెలిపారు. ఒకసారి తనను అసభ్యంగా తాకేందుకు ప్రయత్నించాడని, మధురకు తనతో పాటు రమ్మని బలవంతం చేశాడని ఆమె చెప్పారు. ఆ భయంతోనే ఎవరికీ చెప్పకుండా హాస్టల్‌లోని వస్తువులన్నీ వదిలేసి పారిపోయానని తెలిపారు. ఆ తర్వాత బాబా తన అడ్రస్, ఫోన్ నంబర్ ఇచ్చి పంపడంతో కొందరు విద్యార్థులు తన ఇంటికి వచ్చి, తిరిగి రావాలంటూ ఒత్తిడి చేశారని, కానీ తన తండ్రి వారిని తరిమికొట్టారని ఆమె గుర్తుచేసుకున్నారు. పోలీసు రికార్డుల ప్రకారం చైతన్యానంద తన పలుకుబడి ఉపయోగించి 2009, 2016 సంవత్సరాల్లో నమోదైన లైంగిక వేధింపుల కేసుల నుంచి తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం 17 మంది విద్యార్థినులు ఈ ఏడాది ఆగస్టులో సంయుక్తంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఆ సమయంలో ఆయన లండన్‌లో ఉన్నట్లు భావించినా, తర్వాత ఆగ్రాలో ఆయన ఆచూకీ లభ్యమైంది. ఢిల్లీ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ వేసి, కొన్ని రోజులకే దానిని వెనక్కి తీసుకున్నాడు. ఇక ప్రస్తుతం పరారీలో ఉన్న చైతన్యానంద కోసం ఢిల్లీ, హర్యానా, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్‌లలో పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. అతను దేశం విడిచి పారిపోకుండా లుక్‌అవుట్ సర్క్యులర్ కూడా జారీ చేశారు.

PAPPACHAN muthoot FINCORP
Jab zindagi badalni ho

# ముత్తూట్ ఫిన్‌కార్ప్‌కు 2.7 లక్షల జరిమాన

న్యూఢిల్లీ: ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సంస్థ ముత్తూట్ ఫిన్‌కార్ప్ లిమిటెడ్‌పై భారతీయ రిజర్వ్ బ్యాంక్ చర్యలు తీసుకుంది. నియంత్రణ ఆదేశాలను పాటించడంలో విఫలమైనందుకు గాను, ఆ సంస్థపై రూ. 2.70 లక్షల ద్రవ్య జరిమానా విధించినట్లు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ముఖ్యంగా, 'ఇంటర్నల్ అంబుడ్స్‌మన్' విధానానికి సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించడం వల్లే ఈ పెనాల్టీ విధించినట్లు ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఆర్‌బీఐ నిబంధనల ప్రకారం, సంస్థ అంతర్గత ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం పాక్షికంగా గానీ లేదా పూర్తిగా గానీ తిరస్కరించిన ఫిర్యాదులను.. వాటంతట అవే (ఆటోమేటిక్‌గా) ఇంటర్నల్ అంబుడ్స్‌మన్‌కు చేరేలా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలి. అయితే, ముత్తూట్ ఫిన్‌కార్ప్ అలాంటి ఆటో ఎస్కలేషన్ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో విఫలమైందని ఆర్‌బీఐ తన తనిఖీల్లో గుర్తించింది. ఈ కీలక లోపం కారణంగానే జరిమానా వేసినట్లు పేర్కొంది. 2024 మార్చి 31 నాటి ముత్తూట్ ఫిన్‌కార్ప్ ఆర్థిక స్థితిపై ఆర్‌బీఐ చట్టబద్ధమైన తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో నిబంధనల ఉల్లంఘనను గుర్తించిన అనంతరం, ఎందుకు జరిమానా విధించకూడదో వివరించాలని కోరుతూ కంపెనీకి షోకాజ్ నోటీసు జారీ చేసింది. కంపెనీ అందించిన లిఖితపూర్వక, మౌఖిక వివరణలను పరిశీలించిన తర్వాత, ఆర్‌బీఐ ఈ జరిమానా నిర్ణయానికి వచ్చింది. ఈ జరిమానా కేవలం నియంత్రణ నిబంధనల ఉల్లంఘనకు మాత్రమే సంబంధించిందని, కంపెనీకి, దాని కస్టమర్లకు మధ్య జరిగిన ఏవైనా ఒప్పందాలు లేదా లావాదేవీల చెల్లుబాటును ఇది ఏమాత్రం ప్రశ్నించదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. ఈ చర్యతో పాటు, అవసరమైతే కంపెనీపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ తన ప్రకటనలో సూచించింది.

# రాజీ పడితేనే విజయం

**గూగుల్ మాజీ సీఈవో ఎరిక్ స్మిత్**

న్యూయార్క్: టెక్ రంగంలో విజయం సాధించాలంటే కొన్ని విషయాల్లో రాజీ పడాల్సి ఉంటుందని, వర్క్-లైఫ్ బ్యాలెన్స్ విధానానికి అతి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల పోటీతత్వం దెబ్బతింటుందని గూగుల్ మాజీ సీఈవో ఎరిక్ స్మిత్ అన్నారు. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడుతూ, అదే సమయంలో ఇంట్లో ఉండి పని చేయడం వల్ల నేర్చుకునే తత్వం తగ్గిపోతుందని అభిప్రాయపడ్డారు. వర్క్ ఫ్రమ్ హోమ్ వల్ల మార్గదర్శకత్వ లోటు ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఇది ఆవిష్కరణపై ప్రభావం చూపుతుందని ఎరిక్ స్మిత్ అన్నారు. అమెరికా సాంకేతిక రంగం చైనా నుంచి సవాలు ఎదుర్కొంటుందని ఆయన హెచ్చరించారు. అక్కడ చాలా సంస్థలు '9-9-6' పని సంస్కృతిని అవలంబిస్తుంటాయని తెలిపారు. అంటే ఉదయం తొమ్మిది నుంచి రాత్రి తొమ్మిది వరకు ఆరు రోజుల పాటు సిబ్బంది విధుల్లో ఉంటారని తెలిపారు. అధిక పని గంటలకు వ్యతిరేకంగా అక్కడ చట్టాలు ఉన్నప్పటికీ ఈ విధానం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. దీని కారణంగా అమెరికా వ్యాపారాలు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

# నేడు బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ప్రారంభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ స్వదేశీ 4జీ సేవలు శనివారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ సేవలను శనివారం ప్రారంభించనున్నారు. దీంతో దేశవ్యాప్తంగా ఈ సేవలు అందుబాటులోకి వస్తాయి. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో ఈ 4జీ సేవలను అందుబాటులోకి తీసుకురావడం గమనార్హం. ఇది క్లౌడ్ ఆధారిత నెట్‌వర్క్ అని, భవిష్యత్ అవసరాలకు తగినట్లు 5జీకి సులువుగా అప్‌గ్రేడ్ అవ్వొచ్చని టెలికాం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. సెప్టెంబర్ 27న బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను దేశవ్యాప్తంగా సుమారు 98 వేల సైట్లలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి వెల్లడించారు. పలు రాష్ట్రాల్లో ఒకేసారి ప్రారంభోత్సవం జరగనుందని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఒడిశాలోని జార్సుగూడా నుంచి ఈ నెట్‌వర్క్‌ను ఆవిష్కరించనున్నారు. గౌహతిలో జరిగే కార్యక్రమంలో మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పాల్గొంటారు.

# ప్రేమకు నో చెప్పిందని.. స్కూటీతో ఢీకొట్టిన మాజీ ప్రియుడు

ఇండోర్: ప్రేమ సంబంధాన్ని కొనసాగించడానికి నిరాకరించిందన్న కోపంతో ఓ యువకుడు మాజీ ప్రియురాలిపై కిరాతకంగా దాడికి పాల్పడ్డాడు. వేగంగా స్కూటర్‌పై వచ్చి ఆమెను ఉద్దేశపూర్వకంగా ఢీకొట్టి గాయపరిచాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, నిందితుడు పాత నేరస్తుడు కావడం గమనార్హం. కల్పనా నగర్ ప్రాంతంలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. బాధితురాలు కొద్దికాలం క్రితమే నిందితుడితో తన సంబంధాన్ని తెంచుకుంది. అయితే, తిరిగి తనతో కలవాలంటూ అతడు ఆమెపై ఒత్తిడి తీసుకువస్తున్నాడు. ఈ క్రమంలోనే బెదిరింపులకు కూడా పాల్పడ్డాడు. ఆమె ఇందుకు అంగీకరించకపోవడంతో కక్ష పెంచుకున్నాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, నిందితుడు వేగంగా యాక్టివా స్కూటర్‌పై వచ్చి ఆమెను లక్ష్యంగా చేసుకున్నాడు. అతడి నుంచి తనను తాను కాపాడుకునేందుకు బాధితురాలు ఓ రాయి విసిరింది. దీంతో మరింత రెచ్చిపోయిన నిందితుడు స్కూటర్‌తో ఆమెను బలంగా ఢీకొట్టి, అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ఘటనలో యువతికి గాయాలయ్యాయి. ఈ దాడి అనంతరం బాధితురాలు హీరానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఆమె వాంగ్మూలం ఆధారంగా పోలీసులు నిందితుడిపై దాడి, బెదిరింపులు, ఉద్దేశపూర్వకంగా గాయపరచడం వంటి సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# కడుపులో 29 స్పూన్లు, 19 టూత్‌బ్రష్‌లు

**ఉత్తరప్రదేశ్ ఘజియాబాద్‌లో వింత ఘటన**

లక్నో: కడుపు నొప్పంటూ ఆసుపత్రికి వచ్చిన ఓ వ్యక్తి పొట్టలో ఉన్న వస్తువులను చూసి వైద్యులు నివ్వెరపోయారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 29 స్టీల్ స్పూన్లు, 19 టూత్‌బ్రష్‌లు, రెండు పెన్నులను ఆపరేషన్ చేసి బయటకు తీశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో జరిగిన ఈ ఘటన అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. వివరాల్లోకి వెళితే... హాపుర్‌కు చెందిన 35 ఏళ్ల సచిన్‌ను అతని కుటుంబ సభ్యులు ఘజియాబాద్‌లోని ఒక డీ-అడిక్షన్ సెంటర్‌లో చేర్పించారు. అయితే, తనను అక్కడ వదిలి వెళ్లడం, సెంటర్‌లో సరైన ఆహారం పెట్టకపోవడంతో సచిన్ తీవ్రమైన కోపానికి గురయ్యాడు. రోజంతా కొన్ని చపాతీలు, కొద్దిగా కూర మాత్రమే ఇచ్చేవారని, కొన్నిసార్లు కేవలం ఒక బిస్కెట్‌తో సరిపెట్టేవారని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ క్రమంలోనే సెంటర్‌పై తన కోపాన్ని వింత రూపంలో ప్రదర్శించాడు. వంటగదిలోని స్టీల్ స్పూన్లను దొంగిలించి, బాత్రూమ్‌లోకి తీసుకెళ్లేవాడు. వాటిని ముక్కలుగా విరిచి, నోట్లో పెట్టుకుని నీళ్ల సహాయంతో గొంతులోకి తోసేసుకునేవాడు. ఇలా స్పూన్లతో పాటు టూత్‌బ్రష్‌లు, పెన్నులను కూడా మింగడం ప్రారంభించాడు. కొన్ని రోజుల తర్వాత తీవ్రమైన కడుపునొప్పి రావడంతో అతడిని ఆసుపత్రికి తరలించారు. ఎక్స్-రే, సీటీ స్కాన్ తీసిన వైద్యులు, అతని కడుపులో పేరుకుపోయిన వస్తువులను చూసి షాక్‌కు గురయ్యారు. మొదట ఎండోస్కోపీ ద్వారా వాటిని తొలగించేందుకు ప్రయత్నించినా, అవి పెద్ద సంఖ్యలో ఉండటంతో విఫలమయ్యారు. దీంతో శస్త్రచికిత్స చేసి వాటన్నింటినీ విజయవంతంగా బయటకు తీశారు. "ఇలాంటి ఘటనలు తరచూ మానసిక సమస్యలు ఉన్నవారిలో కనిపిస్తాయి" అని సచిన్‌కు ఆపరేషన్ చేసిన డాక్టర్ శ్యామ్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం సచిన్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు.

# ముందు మీ దేశం చూడు!

**ఆ తర్వాతే యూఎస్ వీసా**

**ఢిల్లీ యువకుడికి యూఎస్ టూరిస్ట్ వీసా రిజెక్ట్**

న్యూఢిల్లీ: విదేశాలకు వెళ్లాలని చాలా మంది కలలు కంటారు. కానీ, అమెరికా వంటి దేశాలకు వెళ్లాలంటే వీసా ఇంటర్వ్యూలో ఎదురయ్యే ప్రశ్నలు, అనుభవాలు కొన్నిసార్లు ఊహించని విధంగా ఉంటాయి. తాజాగా ఇలాంటి ఓ విచిత్ర సంఘటనే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అమెరికా టూరిస్ట్ వీసా కోసం వెళ్లిన ఓ వ్యక్తికి "ముందు మీ దేశంలోని పర్యాటక ప్రాంతాలు చూడండి, ఆ తర్వాత మా దేశానికి రావడం గురించి ఆలోచించండి" అని వీసా అధికారి చెప్పినట్లుగా ప్రచారం జరుగుతోంది. ట్రావెల్ వ్లాగర్ జై ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్న ఒక వీడియో ద్వారా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆ వీడియోలో ఓ వ్యక్తి తన స్నేహితుడికి ఎదురైన అనుభవాన్ని పంచుకున్నాడు. అతని స్నేహితుడు ఢిల్లీలో పుట్టి పెరిగాడని, యూఎస్ టూరిస్ట్ వీసా ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు అధికారి అతడి ప్రయాణ అనుభవాల గురించి అడిగారని చెప్పాడు. తాను ఢిల్లీ దాటి దేశంలో మరే ఇతర ప్రదేశాన్ని సందర్శించలేదని దరఖాస్తుదారు సమాధానమిచ్చాడు. దీనికి స్పందించిన వీసా అధికారి "ముందు మీరు మీ సొంత దేశాన్ని చూడండి, ఆ తర్వాత ఇతర దేశాలకు వెళ్లండి" అని సలహా ఇచ్చి వీసాను తిరస్కరించినట్లు ఆ వ్యక్తి వీడియోలో పేర్కొన్నాడు.

# భారత్‌కు వెళ్లం: పాక్



పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో, శనివారం నుంచి భారత్ ఆతిథ్యమివ్వనున్న ప్రపంచ పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనకూడదని పాకిస్థాన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆ దేశ జాతీయ పారాలింపిక్ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని సమాచారం. భారతదేశంలో జరిగే ఈ కార్యక్రమాన్ని తమ జాతీయ పారాలింపిక్ కమిటీ బహిష్కరించిందని కమిటీ ప్రధాన కార్యదర్శి ఇమ్రాన్ జమిల్ షమీ మీడియాకు వెల్లడించారు. ప్రపంచ పారా అథ్లెటిక్స్‌కు తమ బృందాన్ని పంపకూడదని నిర్ణయించుకున్నామని ఆయన తెలిపారు. ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది, మేనేజర్ల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయానికి వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల కారణంగా జట్టును పంపవద్దని తమ ప్రభుత్వం సూచించిందని ఆయన అన్నారు. దుబాయ్ వేదికగా జరుగుతున్న ఆసియా కప్‌లో రెండు క్రికెట్ జట్ల మధ్య పరిస్థితులు ఎలా ఉన్నాయో అందరికీ తెలుసని ఆయన వ్యాఖ్యానించారు. కాగా, సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 5 వరకు ఢిల్లీ వేదికగా 2025 పారా అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ జరగనుంది.

## లావణ్య చిత్రం



దివ్యభారతి

# ధనుష్‌కు ఇడ్లీ కష్టాలు



తమిళ్ స్టార్ హీరో ధనుష్ నటించిన 'ఇడ్లీ కడాయ్' చిత్రం అక్టోబర్ 1న దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. ఈ సినిమాకి ధనుష్ స్వయంగా దర్శకత్వం వహించిన నేపథ్యంలో అంచనాలు భారీగా పెరిగాయి. తెలుగులో ఈ సినిమాను ఇడ్లీ కొట్టు అనే టైటిల్‌తో విడుదల చేయబోతున్నారు. విడుదల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రమోషన్ స్పీడ్ పెంచాడు. ఇప్పటికే సినిమా భారీ ఈవెంట్స్ ను నిర్వహించి ప్రేక్షకుల్లోకి తీసుకు వెళ్లారు. ఇటీవల ఒక ఈవెంట్‌లో ధనుష్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. సినిమా ప్రమోషన్ కోసం ధనుష్ అబద్దాలు చెప్పాడని, అంతటి హీరో అయ్యి ఉండి ఇలాంటి అబద్ధాలు చెప్పడం ఏంటో అంటూ చాలా సీరియస్‌గానే సోషల్ మీడియాలో ట్రోల్స్ జరిగాయి. ఇదే సమయంలో ధనుష్ ట్రోల్స్‌కి తనదైన శైలిలో సమాధానం ఇచ్చాడు. 'చిన్నప్పుడు ఇడ్లీ కోసం చాలా కష్టపడాల్సి వచ్చేది. బయట ఇడ్లీ కొనుక్కోవడానికి పనికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది' అంటూ ధనుష్ తనకు ఇడ్లీపై ఉన్న అభిమానాన్ని చెప్పుకొచ్చాడు. ధనుష్ ఇడ్లీ గురించి చేసిన వ్యాఖ్యలు, చెప్పిన విషయాలు చర్చనీయాంశం అయ్యాయి. ధనుష్ తండ్రి ఒక దర్శకుడు. ధనుష్ చిన్న వయసులోనే నటన ప్రస్థానం మొదలు పెట్టాడు. తండ్రి మంచి దర్శకుడిగా భారీగానే సంపాదించాడు. అయినా కూడా ఇడ్లీ కోసం కష్టపడ్డట్లు చెప్పడం విడ్డూరంగా ఉందని ధనుష్ ను ఉద్దేశించి చాలామంది కామెంట్స్ చేశారు. చివరకు ధనుష్ ఫ్యాన్స్ సైతం ఆయన మాటలు నమ్మశక్యంగా లేవు అంటూ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఫ్యాన్స్ నుంచి కూడా వస్తున్న విమర్శల నేపథ్యంలో ధనుష్ స్పందించాల్సి వచ్చింది. తాను చేసిన వ్యాఖ్యలను సరిగ్గా అర్థం చేసుకోలేదని చెప్పాడు. 'నేను 1983లో పుట్టాను, మా నాన్న 1991లో దర్శకుడు అయ్యాడు. అయినా అప్పటికి మా పరిస్థితి ఆర్థికంగా గొప్పగా ఏమీ లేదు. 1995 వరకు మేము ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆ విషయం ఇండస్ట్రీలో చాలా మందికి తెలుసు. అంటే నేను పుట్టిన దాదాపు 12 ఏళ్ల వరకు మాకు ఆర్థికంగా ఇబ్బందులు ఎదురు అయ్యాయి. అందుకే నేను ఇడ్లీ కొనేందుకు కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింద'ని మరోసారి చెప్పుకొచ్చాడు.

## ఓజీ నిర్మాతకు మరో షాక్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కిన ఓజీ సినిమా భారీ అంచనాల నడుమ విడుదలై బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది. అయితే టాక్ తో సంబంధం లేకుండా సినిమా కలెక్షన్ల హవా కొనసాగుతున్న తరుణంలో నిర్మాత డీవీవీ దానయ్యకు లీగల్ ఇష్యూల పరంగా మళ్లీ ఒకసారి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ హైకోర్టులో ఈ చిత్రానికి సంబంధించిన టికెట్ రేట్ల అంశం మళ్లీ చర్చనీయాంశమైంది. రెండు రోజుల క్రితం హైకోర్టు సింగిల్ బెంచ్, ప్రభుత్వం ఇచ్చిన టికెట్ రేట్ల పెంపు అనుమతిని రద్దు చేసింది. ఈ నిర్ణయం నిర్మాతలకు పెద్ద షాక్ ఇచ్చింది. దానయ్య తరఫు న్యాయవాది వెంటనే రివ్యూ పిటిషన్ దాఖలు చేసి, టికెట్ ధరల పెంపు అవసరాన్ని వివరించారు. అయితే తాజా విచారణలో హైకోర్టు తమ పూర్వ నిర్ణయంలో మార్పు లేదని స్పష్టం చేసింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని, టికెట్ రేట్ల పెంపుకు ఇప్పటికీ అనుమతి లేదని క్లారిటీ ఇచ్చింది.





## పెళ్లి అంటే పత్రాలపై రాసుకునేది కాదు: అమీర్ ఖాన్



రెండుసార్లు విడాకులు అయ్యాక మూడో వ్యక్తితో సంబంధంలో ఉన్నపుడు ఎదురయ్యే విమర్శల్ని ఎదుర్కోవడం అంత సులువు కాదు. తన చుట్టూ ఉన్న సమాజం అతడిని స్రుకుటిని చేస్తుంది. కానీ అన్నిటినీ తన సమయస్ఫూర్తి, విచక్షణ, నిజాయితీతో ఎదుర్కొంటున్నాడు అమీర్ ఖాన్. ఇప్పుడు టూమచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్ కార్యక్రమంలో అమీర్ ఖాన్ చెప్పిన విషయాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి. ముఖ్యంగా అతడి మాటల్లో నిజాయితీ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. రీనాదత్తా, కిరణ్ రావులకు విడాకులు ఇచ్చిన అమీర్ ఖాన్ ప్రస్తుతం బెంగళూరు యువతి గౌరీ స్ప్రాట్ తో సంబంధంలో ఉన్న సంగతి తెలిసిందే. గౌరీని అతడు ఇంకా పెళ్లాడలేదు. దీంతో అతడికి ప్రతిసారీ పెళ్లి గురించిన ప్రశ్న ఎదురవుతోంది. 60 ఏళ్ల అమీర్ ఖాన్ ఇప్పుడు అలాంటి ప్రశ్నలకు సమాధానంతో సిద్ధంగా ఉన్నాడు. రీనా, కిరణ్ ల నుంచి విడిపోవడం బాధాకరమైనదని షోలో హోస్టుల ముందు అతడు అంగీకరించాడు. కానీ మాజీలతో ఆ పరిస్థితుల్లో ముందుకు సాగడం కష్టమని ఒప్పుకున్నాడు. విడిపోయినా వారు నా కుటుంబంలో భాగం అని చెప్పాడు. వారు అద్భుతమైన వ్యక్తులు అంటూ కితాబిచ్చాడు. పెళ్లి అంటే పేపర్లపై సంతకం కాదు.. ఇద్దరు కనెక్టయి ఉండటం అని తన అనుభవాన్ని వివరించాడు.

## అందరూ నా బాడీ చూశారు

తెలుగు ప్రేక్షకులకు 'బద్రి', 'నాని' చిత్రాలతో సుపరిచితురాలైన సీనియర్ బాలీవుడ్ నటి అమీషా పటేల్, 50 ఏళ్ల వయసులోనూ తాను ఒంటరిగా ఉండటానికి గల కారణాలపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తాను ఇప్పటివరకు పెళ్లి చేసుకోకపోవడానికి గల కారణాలను ఆమె తొలిసారిగా వివరించారు. గతంలో తాను చాలా మందితో డేటింగ్ చేశానని, అయితే వారిలో ఎవరి దగ్గరా నిజాయతీ కనిపించలేదని అమీషా పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. "నా జీవితంలో చాలా మందితో ప్రేమాయణం నడిపాను. కానీ ఎవరూ నన్ను మనస్ఫూర్తిగా అర్థం చేసుకోలేదు. అందరూ నన్ను ఒక స్త్రీగా నా శరీరాన్ని మాత్రమే చూశారు. నా ఆలోచనలకు, నిర్ణయాలకు గౌరవం ఇవ్వలేదు" అని ఆమె తెలిపారు. నా మనసును అర్థం చేసుకునే వ్యక్తి కోసం ఎదురుచూశానని, అందుకే సంబంధాలు పెళ్లి వరకు వెళ్లలేదని స్పష్టం చేశారు. అయితే, తనకు ఇప్పటికీ పెళ్లి చేసుకోవాలనే కోరిక ఉందని అమీషా అన్నారు. "నాకు పెళ్లిపై నమ్మకం పోలేదు. సరైన వ్యక్తి దొరికితే తప్పకుండా మూడు ముళ్లు వేయించుకుంటాను. పిల్లల్ని కని, కుటుంబాన్ని ప్రారంభించాలని ఉంది" అంటూ తన మనసులోని మాటను బయటపెట్టారు.



## ప్రభాస్ మెసేజ్‌తో సుజిత్ ఖుషీ

పవన్ కళ్యాణ్ హీరోగా వచ్చిన ఓజి సినిమా విషయంలో తనకు ప్రభాస్ ఎంతో సపోర్ట్ గా నిలిచారని దర్శకుడు సుజిత్ తెలిపాడు. రిలీజ్ కు ముందు రోజు ప్రభాస్ కు ఓజి రిలీజ్ అనే విషయం చెప్పడానికి ఫోన్ చేశానని, అప్పుడు ప్రభాస్ తనతో కొడతావ్ రా నువ్వు అని చెప్పి తనలో కాన్ఫిడెన్స్ ను పెంచారని తెలిపారు. ఓజి రిజల్ట్ విషయంలో సుజిత్ మొదటినుంచి కాన్ఫిడెంట్ గా ఉన్నప్పటికీ ప్రభాస్ చెప్పిన మాటలు తనకు మంచి బూస్టప్ ను ఇచ్చాయని అతను పేర్కొన్నారు. సెప్టెంబర్ 25న ఓజి ప్రపంచవ్యాప్తంగా రిలీజై అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి బ్లాక్ బస్టర్ టాక్ తో దూసుకెళ్తుండగా, సినిమా రిలీజ్ రోజు ప్రభాస్ సుజిత్ కు బంగారం కొట్టేశావ్ రా అంటూ మెసేజ్ చేశారని, అప్పటివరకు ఎంతమంది చెప్పినా రాని ఆనందం, ప్రభాస్ మెసేజ్ చూశాక నిజంగానే తాను బ్లాక్ బస్టర్ కొట్టాననే ఫీలింగ్ కలిగిందని సుజిత్ వెల్లడించారు.





## హైదరాబాద్‌లో లైగర్ బ్యూటీ సందడి

చార్మినార్ వద్ద ఓ బాలీవుడ్ సినిమా షూటింగ్ జరుగుతోంది. ఈ షూటింగ్‌లో బాలీవుడ్ యంగ్ హీరో లక్ష్య తో పాటు హీరోయిన్ అనన్య పాండే నటిస్తున్నారు. సినిమాకు సంబంధించిన షూటింగ్ చార్మినార్ వద్ద జరిగింది. ఇద్దరూ సాంప్రదాయ దుస్తుల్లో ఉన్నారు. ముఖ్యంగా ఎర్రటి సాంప్రదాయ దుస్తుల్లో ఉండటంతో వీరిని మొదట ఎవరో అనుకున్నారు. కానీ అనన్య పాండేను కొందరు గుర్తు పట్టి చెప్పడంతో ఒక్కసారిగా జనాలు పెరిగారు. జనాలు ఎక్కువగా వచ్చి అనన్య పాండేను, హీరో లక్ష్య ను ఫోటోలు తీయడం, వీడియోలు తీయడం చేశారు.

## మగాళ్ల పట్ల అన్యాయం

టాలీవుడ్ యంగ్ హీరో, స్టార్ బాయ్ సిద్ధూ జొన్నలగడ్డ ఇండస్ట్రీలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నాడు. పలు సినిమాలతో మంచి హిట్స్ ను అందుకున్న సిద్ధూ.. ఇప్పుడు సరైన హిట్ కోసం వెయిట్ చేస్తున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్ లో పాల్గొన్న సిద్ధూ జొన్నలగడ్డ పలు వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత సమాజంతోపాటు ప్రపంచంలో అందరూ మగాళ్ళ పట్ల విచిత్రంగా ప్రవరిస్తున్నారని తెలిపారు. కొన్నిసార్లు కష్టాల్లో ఉన్నప్పుడు.. ఏమైపోయినా పట్టించుకోరని ఆవేదన వ్యక్తం చేశారు. "పురుషుల పట్ల సమాజంతోపాటు ప్రపంచం వింతగా ప్రవర్తిస్తాయి. మీరు ఇబ్బందుల్లో ఉన్నప్పుడు.. ఎవరూ పక్కన ఉండరు. ఎవరూ పట్టించుకోరు. పోయినా పట్టించుకోరేమో. మీరు ఏదో ఒకటి చేయాలి, మీరు ఏదో సాధించాలి, అప్పుడు వెళ్లి నిల్చుంటే మర్యాద ఇస్తారు. కానీ ఆ మర్యాద చాలా జెలసీ" అని సిద్ధూ జొన్నలగడ్డ తెలిపారు.



ఆసియాకప్‌లో ఆదివారం సెప్టెంబర్ 28వ తేదీన ఇండోపాక్ జట్లు ఫైనల్లో పోటీపడనున్నాయి. ఆసియాకప్ టోర్నమెంట్‌కు 41 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్నది. అయితే ఇప్పటి వరకు మల్టీనేషనల్ టోర్నీల్లో అయిదుసార్లు ఇండో, పాక్ జట్లు ఫైనల్లో తలపడ్డాయి. అయిదింటిలో పాకిస్థాన్ మూడు సార్లు ఫైనల్స్ గెలిచింది. తొలిసారి ఇండోపాక్ జట్లు వరల్డ్ చాంపియన్‌షిప్ క్రికెట్ ఫైనల్లో తలపడ్డాయి. ఆ టోర్నమెంట్ 1985లో జరిగింది. ఆ మ్యాచ్‌లో ఇండియా విజయం సాధించింది. చివరిసారి రెండు జట్లు 2017లో చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఆడాయి. ఆ మ్యాచ్‌లో 180 రన్స్ తేడాతో పాకిస్థాన్ గెలుపొందింది.





# భారత్ Vs పాక్.. ఇలా..!




### వరల్డ్ చాంపియన్‌షిప్ ఆఫ్ క్రికెట్, 1984:

ఫస్ట్ బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 9 వికెట్లు కోల్పోయి 176 రన్స్ చేసింది. జావెద్ మియందాద్ 92 బంతుల్లో 48 రన్స్ చేశాడు. భారత బౌలర్ కపిల్ దేవ్ 23 పరుగులిచ్చి మూడు వికెట్లు, శివరామకృష్ణన్ 35 రన్స్ ఇచ్చి మూడు వికెట్లు తీసుకున్నారు. ఆ తర్వాత రవిశాస్త్రి 63, శ్రీకాంత్ 67 రన్స్ స్కోరు చేసి 8 వికెట్ల తేడాతో ఇండియాకు విజయాన్ని అందించారు.

### ఆస్ట్రల్-ఆసియా కప్ ఫైనల్ 1986:

ఇండియా ఫస్ట్ బ్యాటింగ్ చేసింది. 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 245 రన్స్ చేసింది. సునీల్ గవాస్కర్ 134 బంతుల్లో 92 రన్స్ చేశాడు. అయితే పాకిస్థాన్ ఆ టార్గెట్‌ను ఛేజ్ చేసింది. చివరి బంతికి జావెద్ మియందాద్ సిక్సర్ కొట్టి భారత్‌ను నిరాశ పరిచాడు. చేతన్ శర్మ బౌలింగ్‌లో అతను సిక్సర్ బాదాడు. మియందాద్ 114 బంతుల్లో 116 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు.

### ఆస్ట్రల్-ఆసియా కప్ ఫైనల్ 1994:

పాకిస్థాన్ ఫస్ట్ బ్యాటింగ్ చేసి 6 వికెట్లకు 250 రన్స్ స్కోర్ చేసింది. సయిద్ అన్వర్ 47, ఆమిర్ సోహెల్ 69, బాసిత్ అలీ 57 రన్స్ స్కోర్ చేశారు. చేజింగ్ ఇండియా తడబడింది. 211 పరుగులకే ఆలౌటైంది. వినోద్ కాంబ్లీ ఒంటిరి పోరాటం చేశాడు. అతను 56 రన్స్ స్కోర్ చేశాడు.

### ఐసీసీ టీ20 వరల్డ్‌కప్ ఫైనల్:

ఫైనల్లో గౌతం గంభీర్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. 54 బంతుల్లో 75 రన్స్ చేశాడు. రోహిత్ శర్మ కూడా 16 బంతుల్లో 30 రన్స్ చేశాడు. దీంతో ఇండియా 20 ఓవర్లలో 5 వికెట్లకు 157 రన్స్ చేసింది. దీనికి బదులుగా పాకిస్థాన్ ధీటుగా ఆడినా 152 రన్స్‌కే ఆలౌటైంది. మిస్బా ఉల్ హక్ ఒంటరి పోరాటం చేసినా ఓటమి తప్పలేదు.

### చాంపియన్స్ ట్రోఫీ 2017 ఫైనల్:

టోర్నీలో ఫేవరేట్‌గా పోటీలో దిగిన భారత్ అనూహ్యతి రీతిలో ఫైనల్లో ఓడింది. పాక్ బ్యాటర్ ఫకర్ జమాన్ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. అతను 114 రన్స్ స్కోర్ చేశాడు పాకిస్థాన్ నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లకు 338 రన్స్ చేసింది. ఇక చేజింగ్ ఇండియా బ్యాటింగ్ లైనప్ తడబడింది. రోహిత్, విరాట్, ధావన్ వికెట్లను ఆమిర్ తీశాడు. ఇండియా 158 రన్స్ కే ఆలౌటై.. 180 రన్స్ తేడాతో ఓడిపోయింది.



# సెలెక్టర్లనే అడగండి!

## కరుణ్ నాయర్ ఆవేదన

'క్రికెట్ నాకో అవకాశం ఇవ్వు' అంటూ టెస్టు జట్టులోకి వచ్చిన కరుణ్ నాయర్ అవకాశాన్ని ఉపయోగించుకోలేకపోయాడు. ఇంగ్లండ్ పర్యటనతో ఎనిమిదేళ్ల తర్వాత పునరాగమనం చేసిన అతడు దారుణంగా విఫలమయ్యాడు. ఇంకేముంది..అతడి స్థానంలో కుర్రాడు దేవ్‌దత్ పడిక్కల్ వెస్టిండీస్ సిరీస్‌కు ఎంపికయ్యాడు. అంచనాలను అందుకోలేకపోవడంతోనే నాయర్‌ను తప్పించామని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ చెప్పడంతో నాయర్‌కు మరో ఛాన్స్ కష్టమే అనిపిస్తోంది. ఈ నేపథ్యంలో టెస్టు స్క్వాడ్‌లో లేకపోవడంపై నాయర్ స్పందించాడు. 'వెస్టిండీస్‌తో సిరీస్‌కు నన్ను ఎంపిక చేస్తారని ఆశించాను. స్క్వాడ్‌లో నా పేరు లేకపోవడంతో ఏం మాట్లాడాలో తెలియడం లేదు. అసలు మాటలే రావడం లేదు. నన్ను ఎందుకు తప్పించారు? అనే విషయంపై కామెంట్ చేయదలచుకోవడం లేదు. చెప్పాలంటే ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం నాకు చాలా కష్టంగా అనిపిస్తోంది. సెలెక్టర్ల మనసులో ఏముందో వాళ్లనే అడగండి. ఓవల్ టెస్టులో అందరూ విఫలమైనా హాఫ్ సెంచరీ సాధించాను. నావంతుగా జట్టుకు ఉపయోగపడ్డానని అనుకున్నా. కానీ, ఈ విషయాన్ని అందరూ మరచిపోయారు' అని నాయర్ అన్నాడు.

## గాయంతో ఇండియా టూరుకు జోసెఫ్ దూరం

వెస్టిండీస్ యువ సంచలన బౌలర్ షామర్ జోసెఫ్.. భారత్ టూరు నుంచి దూరం అయ్యాడు. గాయం కారణంగా అతన్ని తుది జట్టు నుంచి తప్పించారు. అక్టోబర్ రెండో తేదీ నుంచి భారత్, వెస్టిండీస్ మధ్య టెస్టు సిరీస్ ప్రారంభంకానున్న విషయం తెలిసిందే. జోసెఫ్ స్థానం విండీస్ బోర్డు ఆల్‌రౌండర్ జోహన్ లేయిన్‌కు స్థానం కల్పించింది. ఈ విషయాన్ని విండీస్ క్రికెట్ తన ఎక్స్ అకౌంట్‌లో ప్రకటించింది. అయితే 26 ఏళ్ల బౌలర్ జోసెఫ్‌కు ఎటువంటి గాయం అయ్యిందన్న విషయాన్ని వెల్లడించలేదు. అక్టోబర్ 18వ తేదీ నుంచి బంగ్లాదేశ్‌తో జరిగే సిరీస్ సమయంలో జోసెఫ్‌పై మళ్లీ తుది నిర్ణయం తీసుకోనున్నట్లు విండీస్ బోర్డు చెప్పింది. షామర్ జోసెఫ్ లేకపోవడం విండీస్‌కు పెద్ద దెబ్బే. గయానాకు చెందిన ఆ స్పీడ్ బౌలర్ ప్రస్తుతం టాప్ ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటి వరకు 11 టెస్టులు ఆడిన అతను 51 వికెట్ల తీసుకున్నాడు. 21.66 సగటుతో అతను వికెట్లు తీశాడు. జోసెఫ్ స్థానంలో తీసుకున్న లేయిన్ వయసు 22 ఏళ్లు. అతను బార్బడోస్‌కు చెందిన ఆల్‌రౌండర్.





# సూపరో.. ఓవర్!

**సూపర్ ఓవర్‌లో టీమిండియా గెలుపు.. విజయగర్వంతో ఫైనల్‌కు సూర్యసేన.. దంచికొట్టిన ఇరు జట్ల బ్యాటర్లు**

ఆసియా కప్‌లో టీమిండియా జోరు కొనసాగుతుంది. వరుసగా 6వ మ్యాచ్‌లోనూ టీమిండియా గెలుపొందింది. శ్రీలంకతో శుక్రవారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో టీమిండియా సూపర్ ఓవర్‌లో గట్టెక్కింది. హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్ సంచలన బౌలింగ్‌తో ఓటమిని తప్పించుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 202 పరుగులు చేసింది.

అభిషేక్ శర్మ(31 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61), తిలక్ వర్మ(34 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 49 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగగా.. సంజూ శాంసన్(23 బంతుల్లో ఫోర్, 3 సిక్స్‌లతో 39), అక్షర్ పటేల్ (15 బంతుల్లో ఫోర్, సిక్స్‌తో 21 నాటౌట్) మెరుపులు మెరిపించారు. శ్రీలంక బౌలర్లలో మహీష తీక్షణ, దుష్మంత్ చమీర, వానిందు హసరంగ, డసన్ షనక, చరిత్ అసలంక చెరో వికెట్ తీసారు.

శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 202 పరుగులే చేసింది. పాతుమ్ నిస్సంక(58 బంతుల్లో7 ఫోర్లు, 6 సిక్స్‌లతో 107 నాటౌట్) సెంచరీతో చెలరేగగా.. కుశాల్ పెరీరా(32 బంతుల్లో 8 ఫోర్లు, సిక్స్‌తో 58) హాఫ్ సెంచరీతో రాణించాడు. డసన్ షనక(11 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 22 నాటౌట్) మెరుపులు మెరిపించాడు. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా తలో వికెట్ తీసారు. ఆఖరి ఓవర్‌లో శ్రీలంక విజయానికి 12 పరుగులు అవసరం కాగా.. హర్షిత్ రాణా తొలి బంతికే సెంచరీ హీరో పాతుమ్ నిస్సంకను క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. తర్వాతి మూడు బంతుల్లో 5 పరుగులు రాగా.. ఐదో బంతిని షనక బౌండరీ తరలించాడు. దాంతో ఆఖరి బంతికి శ్రీలంక విజయానికి మూడు పరుగులు అవసరం కాగా.. రెండు పరుగులు మాత్రమే వచ్చాయి. దాంతో మ్యాచ్ టై అయ్యి సూపర్ ఓవర్ ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాతుమ్ నిస్సంక వికెట్‌తో మ్యాచ్ మలుపు తిరిగింది. సూపర్ ఓవర్‌లో అర్ష్‌దీప్ సింగ్ బౌలింగ్ చేయగా.. తొలి బంతికే కుశాల్ పెరీరా(0) ఔటయ్యాడు. తర్వాతి రెండు బంతులకు వైడ్ సాయంతో రెండు పరుగులే రాగా.. నాలుగో బంతికి డసన్ షనక సింగిల్ తీయబోయి రనౌట్ అయ్యాడు. అయితే రనౌట్ కంటే ముందే అంపైర్ క్యాచ్ ఔట్ ఇవ్వగా.. షనక రివ్యూ తీసుకున్నాడు. కానీ బంతి బ్యాట్‌కు



తగలకపోవడంతో నాటౌట్‌గా తేలింది. అంపైర్ నిర్ణయం తర్వాత బంతి డెడ్ అవుతుంది. కాబట్టి రనౌట్ లెక్కలోకి రాదు. దాంతో షనక ఔటవ్వకుండా బచాయించాడు. ఈ నిర్ణయం అభిమానులతో పాటు భారత ఆటగాళ్లను అయోమయానికి గురి చేసింది. కానీ అంపైర్లు ఆటగాళ్లకు వివరించి చెప్పారు. కానీ మరుసటి బంతికే షనక క్యాచ్ ఔటయ్యాడు. దాంతో భారత్ లక్ష్యం మూడు పరుగులుగా నమోదైంది. అనంతరం భారత్ ఒక్క బంతికే మూడు పరుగులు చేసి గెలుపొందింది.

### బుమ్రా బౌలింగ్‌తో టీమిండియాకు నష్టమే

టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. గాయాల బారిన పడకుండా ఉండేందుకు జస్‌ప్రీత్ బుమ్రా జాగ్రత్తగా బౌలింగ్ చేస్తున్నాడని ఆరోపించాడు. ఇది ఆసియాకప్‌లో పెద్దగా ప్రభావం చూపకపోయినా.. ప్రపంచకప్‌లో టీమిండియాకు తీరని నష్టం చేస్తుందని హెచ్చరించాడు. రోహిత్ శర్మ సారథ్యంలో వరుసగా బౌలింగ్ చేయకుండా జట్టు అవసరాలకు తగ్గట్లు బౌలింగ్ చేసిన బుమ్రా.. సూర్యకుమార్ సారథ్యంలో మాత్రం ఆరంభంలోనే మూడు ఓవర్లు బౌలింగ్ చేసి, ఒక్క ఓవర్‌ను చివర్లో వేస్తున్నాడని తెలిపాడు. సోషల్ మీడియా వేదికగా ఇందుకు సంబంధించిన గణంకాలను ప్రస్తావిస్తూ ట్వీట్ చేశాడు. 'రోహిత్ శర్మ కెప్టెన్సీలో బుమ్రా సాధారణంగా 1, 13, 17, 19 ఓవర్లలో బౌలింగ్ చేసేవాడు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో మాత్రం బుమ్రా ఆరంభంలోనే మూడు ఓవర్ల స్పెల్ వేస్తున్నాడు. గాయాల బారిన పడకుండా ఉండేందుకు, వామప్ తర్వాత బౌలింగ్ చేసేందుకు బుమ్రా ఇష్టపడుతున్నాడు. మిగిలిన 14 ఓవర్లలో బుమ్రా కేవలం ఒక ఓవర్ మాత్రమే వేయడం బ్యాటర్లకు గొప్ప ఊరటనిస్తుంది. ప్రపంచకప్‌లో బలమైన జట్లతో ఇలా బౌలింగ్ చేయిస్తే భారత్‌కు నష్టం కలిగించవచ్చు.'

# భారత్ ఏ ఘన విజయం

**శతక్కొట్టిన రాహుల్, సుదర్శన్.. 5 వికెట్ల తేడాతో ఓడిన ఆస్ట్రేలియా**



స్వదేశంలో వెస్టిండీస్ సిరీస్‌కు ముందు భారత ఆటగాళ్లు కేఎల్ రాహుల్(176 నాటౌట్), సాయి సుదర్శన్(100) శతకాలతో చెలరేగారు. ఆస్ట్రేలియా ఏ బౌలర్లపై విరుచుకుపడిన ఈ ఇద్దరూ భారత ఏ జట్టును విజయ తీరాలకు చేర్చారు. ఆసీస్ నిర్దేశించిన 412 పరుగుల లక్ష్యాన్ని మరో ఐదు వికెట్లు ఉండగానే ఛేదించింది. తొలి టెస్టు డ్రాగా ముగిసినా.. రెండో టెస్టులో భారీ లక్ష్యాన్ని ఛేదించిన భారత్ 1-0తో సిరీస్ కైవసం చేసుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో సమిష్టి వైఫల్యంతో 194కే కుప్పకూలిన భారత ఏ జట్టు అనూహ్య పోరాటంతో ఆస్ట్రేలియాకు షాకిచ్చింది. సాయి సుదర్శన్ మినహా ఏ ఒక్కరూ రాణించకపోవడంతో భారీ ఆధిక్యం సాధించిన ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో మానవ్ సుతార్, యశ్ ఠాకూర్‌ల విజృంభణతో 185కే ఆలౌటయ్యింది. అనంతరం 412 పరుగుల ఛేదనకు దిగిన భారత జట్టు 85 వద్ద ఓపెనర్ జగదీశన్ (36) వికెట్ కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన సాయి సుదర్శన్(100), కేఎల్ రాహుల్(176 నాటౌట్) జతగా ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఏ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మూడో రోజు 74 పరుగుల వద్ద రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రాహుల్.. నాలుగో రోజు నైట్ వాచ్‌మన్ మానవ్ సుతార్(5) వికెట్ పడ్డాక క్రీజులోకి వచ్చాడు. సాయి సుదర్శన్‌తో కలిసి రాహుల్ 78 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. సెంచరీ తర్వాత సుదర్శన్ వెనుదిరిగినా ఈ డాషింగ్ బ్యాటర్ మాత్రం జట్టును గెలిపించాలనే కసితో ఆడాడు. కెప్టెన్ ధ్రువ్ జురెల్(56)తో పాటు కంగారు యువ బౌలర్లను ఓ ఆట ఆడుకున్న రాహుల్ ఐదో వికెట్‌కు 19 ఓవరల్లో 115 పరుగులు రాబట్టాడు. జురెల్ ఔటైనా నితీశ్ రెడ్డి(16 నాటౌట్) సాయంతో జట్టును గెలిపించాడు రాహుల్. ఆసీస్ బౌలర్లలో టాడ్ మర్ఫీ మూడు, కొరే రోచిసిలి రెండు వికెట్లతో రాణించారు.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
శనివారం 27-9-2025
www.evarthalu.com
నేటి ఈవార్తలు



భారత స్వాతంత్ర్య పోరాటంలో..
ముల్కీ ఉద్యమంలో..
నిరంకుశ నిజాం వ్యతిరేక పోరాటంలో..
తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో..
కొండా లక్ష్మణ్ బాపూజీది కీలక పాత్ర.

ఏకకాలంలో నాలుగు భిన్నమైన, అంతర్గత సంబంధం కలిగిన ప్రజా ఉద్యమాలతో ముడిపడి ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ.. దశాబ్దాల తెలంగాణ కల సాకారమైన వేల ఆ స్వప్నాన్ని చూడలేకపోయినా, తెలంగాణ ప్రతి అణువణువూ ఆయన ఉంటారు. ఉద్యమాలతోపాటు ప్రజాప్రతినిధిగా నిరంతరం ప్రజాసేవ కోసం తపించిన గొప్ప నేత ఆయన. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాంకిడిలో 1915 సెప్టెంబరు 27న జన్మించిన కొండా లక్ష్మణ్ న్యాయవాద విద్యను అభ్యసించారు. నాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ విముక్తి పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు.



# తెలంగాణ జాతిపిత.. కొండా లక్ష్మణ్ బాపూజీ



కట్కం శ్రీనివాస్

1947లో కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చిన నిజాం నవాబుపై బాంబులు విసిరిన సంఘటనలో నిందితుడు. ఈ సమయంలో పోలీసులకు దొరక్కుండా తప్పించుకుని మద్రాసు పారిపోయారు. 1948లో నిజాం పాలన నుంచి తెలంగాణకు విముక్తి లభించగా, విశాలాంధ్ర ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించారు. 1952 ఎన్నికల్లో తొలిసారి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొండా లక్ష్మణ్ బాపూజీ, తర్వాత 1967,1972లో భువనగిరి నుంచి అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. 1957–60 వరకు ఉమ్మడి రాష్ట్రం డిప్యూటీ స్పీకర్‌గా, అనంతరం దామోదరం సంజీవయ్య క్యాబినెట్‌లో ఎక్సైజ్, చేనేత, చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రిగా, బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, సమాచార శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. తర్వాత సీఎం పదవికోసం పీవీ నరసింహారావుతో పోటీపడ్డారు. సీఎం పదవి దక్కనందుకు గవర్నర్‌గా నియమిస్తామని నాటి ప్రధాని ఇందిరాగాంధీ పిలిచి చెబితే దానిని సున్నితంగా తిరస్కరించారు. కాసు బ్రహ్మానంద రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా ఉంటూనే, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. ఉద్యమ ఉధృతి కోసం మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ రాజీనామానే తెలంగాణ ఉద్యమాన్ని ఒక చారిత్రక మలుపు తిప్పింది. 1973లో పీవీ నరసింహారావు తదనంతరం బాపూజీకి ముఖ్యమంత్రి అయ్యే అవకాశం దొరికింది. కానీ, నాటి హోమ్ మంత్రి ఉమా శంకర్ దీక్షిత్ పట్టుదల కారణంగా జలగం వెంగళరావు ముఖ్యమంత్రి అయ్యారు. 1958లో బాపూజీ హుస్సేన్‌సాగర్ తీరాన భూమి కొనుక్కొని జలదృశ్యం పేరిట బంగ్లాను నిర్మించుకున్నారు. 2000 సంవత్సరంలో మలిదశ తెలంగాణ ఉద్యమం ప్రారంభించిన కేసీఆర్‌ను ప్రోత్సహించడమే కాకుండా తన జలదృశ్యం ఇంటిని టీఆర్ఎస్ ప్రధాన కార్యాలయానికి ఇచ్చారు. అందులోనే తెలంగాణ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది. 2002లో చంద్రబాబు ప్రభుత్వం దానిని నేలమట్టం చేయగా, కోర్టు ద్వారా అనుకూల తీర్పు పొందారు. 1952 ముల్కీ ఉద్యమంలోనూ ఆయన పాత్ర ఉంది. తెలంగాణ కోసం 97 యేండ్ల వయసులో చలిని కూడా లెక్క చేయక ఢిల్లీలో దీక్ష చేశారు. అశోక్‌నగర్‌లోని అద్దె ఇంటిలోనే కొండా లక్ష్మణ్ బాపూజీ నివసించారు. తెలంగాణ కోసం ఉద్యమించి, ఉద్యమకారులతో ఇందిరాపార్కు వద్ద సత్యాగ్రహ దీక్ష, ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో సత్యాగ్రహం ఆయన పోరాట స్ఫూర్తికి నిదర్శనం. తెలంగాణా అంతటా బస్సుయాత్ర చేపట్టి, చార్మినార్ నుంచి అమరవీరుల స్తూపం వరకు పాదయాత్ర నిర్వహించారు. సమైక్యవాదులతోపాటు ఉభయులకు న్యాయం జరగాలని కోరుకునే సామాజికవేత్త సాంబశివరావు లాంటి ఎందరినో ఆహ్వానించి తెలంగాణ రాష్ట్రానికి మద్దతు ఇవ్వాలంటూ శాంతి చర్చలు జరిపారు. ప్రత్యేక రాష్ట్రం ఇవ్వకపోతే సమాంతర ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తేల్చిచెప్పారు. 97 ఏళ్ల వయసులో 2012 సెప్టెంబర్ 21న ఆయన కన్నుమూశారు. జన్మభూమి రుణం తీర్చుకోడానికి 2010లో తన స్వగ్రామం వాంకిడిలో లక్ష్మణ్ సేవాసదన్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. సంస్థ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు.

---

ఉదయాన్నే లేవడం ఆఫీసుకు వెళ్లడం, తిరిగి సాయంత్రం ఇంటికి రావడం ఇదే అందరి జీవితాల్లో ఉండే దినచర్య. రోజు వారీ ఈ బిజి లైఫ్ నుంచి కాస్త ప్రశాంతత కోసం చాలామంది ఎక్కడికైనా వెళ్లేందుకు సిద్ధపడుతుంటారు. అంటే కొత్త ప్రదేశాలను చూడడం, కొత్త వారిని కలవడం, ప్రయాణించడం, జ్ఞాపకాలను సేకరించడం ఇలాంటివి చేయడమంటే ఎవరైనా ఇష్టపడతారు. ఎంత పెద్ద సెలబ్రిటీ అయినా, సామాన్యుడైనా ప్రతిఒక్కరికీ విరామం కావాల్సిందే. ఎవరికి తగ్గ స్థోమతలో ఆ విరామ సమయంలో వారికి నచ్చిన ప్రదేశాలను చుట్టేందుకు ఇష్టపడుతుంటారు. ఎంత బిజిగా ఉన్నా సరే ప్రయాణాలకు సమయం కేటాయిస్తుంటారు చాలామంది.




# పదండి.. ప్రపంచాన్ని చుట్టేద్దాం

స్నేహితులతో ప్రయాణించేందుకు ఇష్టపడతారు. కొందరేమో కుటుంబంతో కలిసి ఫ్యామిలీ ట్రిప్ వేస్తుంటారు. కానీ, ప్రతి మనిషి తన జీవితంలో ఏదో ఒక సమయంలో అలసిపోయి కాస్త విరామం కోరుకుంటాడు. ఆ సమయంలో ఎక్కడికైనా టూర్‌కి వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకుంటాడు. అదే పర్యాటకం. పర్యాటకం నేటి కాలంలో చాలామందికి ఒక ఉపాధిగా మారింది. దీనివల్ల చాలామందికి జీవనోపాధి దొరికింది. ప్రపంచంలోని ఏ మూలకు వెళ్లినా మనకు పర్యాటకం కనిపిస్తుంది. ఈ రోజు దేశవ్యాప్తంగానే కాకుండా విదేశాల నుండి కూడా పర్యాటకులు పర్యాటకం వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. ఈ నేపథ్యంలో పర్యాటక ప్రాముఖ్యత, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ, ఆర్థిక విలువల గురించి అంతర్జాతీయంగా ప్రజలకు అవగాహన కల్పించే దిశగా ఈ టూరిజం డేను నిర్వహిస్తారు. ఈ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని 1970లో ప్రపంచ పర్యాటక సంస్థ జరుపుకోవడం ప్రారంభించింది. దీని తరువాత మొదటిసారిగా యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ వారు 1980లో 'ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని' సెప్టెంబర్ 27న నిర్వహించడం ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటివరకూ వరల్డ్ టూరిజం డేను ఒక్కో ఏడాది ఒక్కో అంశంతో జరుపుకుంటున్నారు. 1980లో అంటే మొదటిసారిగా 'టూరిజం కంట్రిబ్యూషన్ టు ది ప్రిజర్వేషన్ ఆఫ్ కల్చరల్ హెరిటేజ్ అండ్ టు పీస్ అండ్ మ్యూచువల్ అండర్‌స్టాండింగ్ అనే పేరుతో టూరిజం డేను నిర్వహించుకున్నారు. ఇలా ప్రతి ఏటా ఒక్కో అంశంతో



టూరిజం పట్ల పర్యాటకుల్లో ఆసక్తిని కలిగించే విధంగా ప్రయత్నం చేస్తున్నారు.

### బహుబాగు.. భారత పర్యాటకం

భారతదేశ పర్యాటక రంగం సరికొత్త శిఖరాలను అధిరోహిస్తోంది. దేశీయంగా, అంతర్జాతీయంగా పర్యాటకులు భారత్‌కు పోటెత్తుతున్నారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి దేశంలో సుమారు 303.59 కోట్ల దేశీయ పర్యాటక సందర్శనలు నమోదయ్యాయని, అదే సమయంలో 56 లక్షల మంది విదేశీ పర్యాటకులు దేశాన్ని సందర్శించారని శుక్రవారం విడుదలైన అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పర్యాటక రంగం కేవలం సందర్శనలకే పరిమితం కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతాన్ని అందిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను దేశ జీడీపీలో పర్యాటక రంగం వాటా 5.22 శాతంగా, అంటే రూ. 15.73 లక్షల కోట్లుగా ఉందని జాతీయ గణాంకాలు వెల్లడించాయి. అంతేకాకుండా, ఈ ఏడాది జూన్ నాటికి పర్యాటకం ద్వారా రూ. 51,532 కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని భారత్ ఆర్జించింది. గత దశాబ్ద కాలంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఈ రంగానికి కొత్త జీవం పోశాయి. ముఖ్యంగా 'స్వదేశ్ దర్శన్' పథకం కింద దేశవ్యాప్తంగా పర్యాటక సర్క్యూట్లను అభివృద్ధి చేయడం సత్ఫలితాలనిస్తోంది. రామాయణ, బుద్ధిస్ట్, కోస్టల్, గిరిజన వంటి థీమ్‌లతో ఇప్పటివరకు 110 ప్రాజెక్టులను అభివృద్ధి చేశారు. పర్యావరణ హితమైన టూరిజాన్ని ప్రోత్సహించేందుకు 'సస్టైనబుల్ అండ్ రెస్పాన్సిబుల్ టూరిజం' కార్యక్రమం కింద 2024–25లో 23 రాష్ట్రాల్లో రూ. 3,295.76 కోట్లతో 40 ప్రాజెక్టులకు కేంద్రం పూర్తి నిధులను మంజూరు చేసింది. పర్యాటక రంగం అభివృద్ధి ఉపాధి కల్పనలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ప్రకారం, ఈ రంగం ప్రత్యక్షంగా 3.69 కోట్ల మందికి, పరోక్షంగా 4.77 కోట్ల మందికి ఉపాధి కల్పిస్తోంది. ఇది దేశంలోని మొత్తం ఉపాధిలో 13.34 శాతానికి సమానం. మెడికల్ టూరిజం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ వరకు వైద్య చికిత్సల కోసం 1,31,856 మంది విదేశీయులు భారత్‌కు వచ్చారు. ఇది మొత్తం విదేశీ పర్యాటకులలో 4.1 శాతంగా నమోదైంది.

---

# భాగస్వామ్యం.. జర భద్రం

ప్రస్తుతం స్టార్టప్స్, ఆవిష్కరణాత్మక వ్యాపారాలు పెరుగుతున్న నేపథ్యంలో, సహ వ్యవస్థాపకుల మధ్య స్పష్టత, న్యాయం, పరస్పర విశ్వాసం అత్యవసరం. ఈ దిశగా సహ వ్యవస్థాపకుల ఒప్పందం ఒక బలమైన చట్టపరమైన పత్రంగా నిలుస్తుంది. ఈ ఒప్పందం ద్వారా వ్యవస్థాపకుల హక్కులు, బాధ్యతలు, వాటాలు, భవిష్యత్ వ్యాపార దిశను ముందుగానే నిర్ధారించవచ్చు. సహ వ్యవస్థాపకుల ఒప్పందం ద్వారా భవిష్యత్ సమస్యలను నివారించవచ్చు. ఈ ఒప్పందంలో పలు నిబంధనలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. వ్యాపార ప్రాథమిక ఆస్తులను రక్షించుకోవడం, వ్యాపార రహస్యాలు, ప్రయోజనాలను కాపాడుకోవడం, వేతనాలు, లాభాల భాగస్వామ్యంలో స్పష్టత ఉండటం, వాటాల కొనుగోలు, రద్దు తదితర అంశాలు కీలక పాత్ర వహిస్తాయి. అలాంటి సందర్భాల్లో సహ వ్యవస్థాపకుల ఒప్పందం గొప్ప ప్రయోజనకారిగా నిలుస్తుంది.

### ముఖ్య నిబంధనలు:

- ఈక్విటీ వాటాలు, మూలధన సాయం: ప్రతి వ్యవస్థాపకుడి వాటా శాతం, వారు సమకూర్చే డబ్బు, మేధో సంపత్తి లేదా ఆస్తులను స్పష్టంగా నమోదు చేస్తుంది. భవిష్యత్తులో ఎవరి వాటా ఎంత అన్న దానిపై వివాదాలు రాకుండా చేస్తుంది.
- పాత్రలు, బాధ్యతలు: ఎవరు సీఈఓ, ఎవరు సీ టీ ఓ, ఎవరు మార్కెటింగ్ లేదా ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించాలి అన్నది నిర్దిష్టంగా ఉంటుంది. విధుల స్పష్టతతో వ్యాపార నిర్ణయాలు సులభం అవుతాయి.
- నిర్ణయాల తీసుకోవడం: మెజారిటీ, ఏకగ్రీవత లేదా వాటా ఆధారిత ఓటింగ్ పద్ధతులు నిర్ణయించబడతాయి. అంతర్గత విభేదాలను సమర్థవంతంగా పరిష్కరించడానికి సహాయం చేస్తుంది.
- షేర్ల వెస్టింగ్: వ్యవస్థాపకులు క్రమంగా షేర్లను పొందే విధానాన్ని నిర్దేశిస్తుంది. ఒకరు ముందుగానే కంపెనీని వదిలి వెళితే, అధిక వాటా తీసుకుపోకుండా నిరోధిస్తుంది.



పీ జయపాల్ రెడ్డి
బీఎస్సీ, ఎంఏ, ఎల్ఎల్‌బీ



OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.